ANN తెలుగు

Follow: @ANNTELUGU

23-08-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 229 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఇదేం ఆత్మనిర్భర్ భారత్?

- మూడునెలల్లో చక్కెరధర 40శాతం పెరగడం ఏంటి?
- పండుగ ముందు చక్కెర కొరత ఏంటి?
- తీవ్రంగా ఫైర్ అయిన మల్లిఖార్జున్ ఖర్గే

**ఢిల్లీ, మహా :** దేశీయ మార్కెట్లో చక్కెర ధరల పెరుగుదల, కొరత నేపథ్యంలో కేంద్రం తీరుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే మండి పడ్డారు. మోదీ ప్రభుత్వం విధానాల వల్ల పండుగల సీజన్‌కు ముందే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని, మోదీ ప్రభుత్వ విధా నాల్లోని చేదు, చక్కెరలోని మాధుర్యా నికి పాకింది' అని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమ ర్శిస్తూ, ఆయన శనివారం ఎక్స్‌లో పలు ప్రశ్నలు సంధించారు. "మోదీ ప్రభుత్వానికి నేను సూటిగా మూడు ప్రశ్నలు అడుగుతున్నా. ప్రపంచం లోనే అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారు, ఎగుమతిదారు అయిన భారతదేశం లో, చక్కెర నిల్వలు గత 9 ఏళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి ఎందుకు పడిపోయాయి? ఎగుమతు లను నిలిపివేసి, 10 లక్షల టన్నుల చక్కెరను సుంకం

మిగతా 2వ పేజీలో

### టాప్ న్యూస్



## కొండా సుస్మిత లైన్ దాటి ఆరోపణలు చేశారు

- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్
- రాజగోపాల్ రెడ్డి హద్దుమీరలేదు

02



## డీఎస్సీపై జగన్‌కు లోకేశ్ ఐదో సవాల్

- 'టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.
- చర్చకు నేను సిద్ధం'.
- విజయనగరం టీడీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పిలుపు

03



## నన్ను టార్గెట్ చేస్తున్నవారిపై చర్యలు తీసుకోండి

- మంత్రి కొండా సురేఖ మరో లేఖ

03



## మెట్రో రెండోదశలో భూగర్భ మార్గాలు

02

- విమానాశ్రయాలు, రైల్వే ట్రాక్‌ల వద్ద ప్రత్యేక డిజైన్
- రూ.38,595 కోట్లతో మెట్రో రెండోదశ



02

## ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్‌పై తుమ్మల ఆందోళన

- యూరియా ఉత్పత్తి నిలిచిపోవడంపై కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలి





# లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

### కేంబ్రిడ్జి వర్సిటీని సందర్శించిన సీఎం బృందం

- విద్య, పరిశోధనల్లో భాగస్వామ్యంపై చర్చ
- హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరిన సీఎం బృందం
- నేటితో ముగియనున్న పర్యటన
- సీఎం అమెరికా పర్యటనకు అడ్డంకులపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ఆగ్రహం
- ముఖ్యమంత్రులు వెళ్ళి పెట్టుబడులు తెస్తారనే భయం కేంద్రంలో ఉందని చురకలు

**హైదరాబాద్, మహా :** లండన్‌లోని ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ వర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సం దర్శించింది. విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వా మ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరారు. యువపారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌లు హాజరయ్యారు. మరోవైపు సీఎం రేవంత్ పర్యటనకు కేంద్రం నో చెప్పడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు.

**ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లివర్‌పుల్ ఆసక్తి**

లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లండన్‌లోని లివర్‌పూల్ సిటీ డెవ లప్‌మెంట్ విభాగం ఆసక్తి చూపింది. భాగస్వామ్య ఒప్పందం చేసుకునేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్ రానుంది. లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లివర్‌పూ ల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి**

లండన్‌లోని ప్రఖ్యాత ఇంపీరియల్ కాలేజీని సీఎం సలహాదారు రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, అమాండా వోల్తుయిజెన్,

మిగతా 2వ పేజీలో




## గచ్చిబౌలిలో అక్రమ భవనాలపై హైడ్రా ఉక్కుపాదం

### 50 గజాల్లో ఏడంతస్తులు.. ఇద్దరి మృతి

### నాలాలపై నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్‌కు రంగనాథ్ ఆదేశం

**హైదరాబాద్, మహా :** .గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలిన ఘటన హైదరాబాద్‌లో సంచలనం సృష్టించింది. నాలాను ఆనుకుని కేవలం 50 చదరపు గజాల స్థలంలో నిర్మించిన ఈ భవనం శనివారం మధ్యాహ్నం పేకమేడలా కూలిపోవడంతో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయా రు. శిథిలాలు పక్కనే ఉన్న భవనంపై పడటంతో పలు ఫ్లాట్లు దెబ్బతిన్నాయి. సమీపంలోని హాస్టల్ నుంచి విద్యార్థులను కూడా భద్రతా కారణాలతో బయటకు తర లించారు. ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ట్ట డాలపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే మాదాపూర్ పోలీసులు, హైడ్రా, అగ్నిమాపక

మిగతా 3వ పేజీలో




## బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

02

- నూతన జాతీయ కార్యవర్గంతో సమావేశం
- కొత్త ఆలోచనలతో పార్టీని బలోపేతం చేయాలని దిశానిర్దేశం
- 14 ఏండ్లు పైబడిని వారిని లక్ష్యంగా చేసుకుని కార్యక్రమాలు

## బల్దియాలో దోచుకున్న వారికి దోచుకున్నంత




- పనులు లేకున్నా బిల్లుల పంపకానికి స్కెచ్ వేసారనే ఆరోపణలు
- కాంట్రాక్టర్లకు అప్పనంగా బిల్లుల ఆశలు
- ముందుగా కమిషన్లు.. తర్వాత బిల్లులు
- ఆలస్యంగా వెలుగులోకి వస్తున్న పాత బిల్లుల బాగోతం

05

## నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికైన కామారెడ్డి టీచర్

- రాష్ట్రం నుంచి ఒక్క ఉపాధ్యాయురాలే ఎంపిక
- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న భవాని
- వచ్చే నెల 5 న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న టీచర్

02



MANDIRA PREMIUM SILVER JEWELLERY by manepally

Purchase ₹ 50,000/-
Free Jewellery Voucher of
₹ 15,000/-
along with
FREE GOLD COIN

Purchase ₹ 1.00,000/-
Free Jewellery Voucher of
₹ 30,000/-
along with
FREE GOLD COIN



MANDIRA | PREMIUM SILVER JEWELLERY
by manepally

PUNJAGUTTA
99590 11192
A.S. RAO NAGAR
99590 11194

## పెట్టుబడులకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్

02

: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



# నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికైన కామారెడ్డి టీచర్



**కామారెడ్డి, మహా :** కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని ఎంపీపీ గర్ల్స్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయురాలు భవాని అరుదైన గౌరవం దక్కించుకున్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఆమె ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా కేంద్ర విద్యాశాఖ ఎంపిక చేసిన 48 మంది ఉత్తమ ఉపాధ్యాయుల్లో తెలంగాణ నుంచి భవాని ఒక్కరే స్థానం సంపాదించారు. వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆమెకు ఈ పురస్కారం దక్కింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 5న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా భవాని ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆమెను అభినందించారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూనే విద్యార్థుల్లో అభ్యసన ఆసక్తిని పెంచేందుకు ఆమె చేస్తున్న ప్రయోగాలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవాని బోధన పద్ధతిలో ప్రత్యేకత ఉంది. సాధారణంగా పుస్తకాల్లోని పాఠాలను చదివించి పరీక్షలకు సిద్ధం చేయడం కంటే పిల్లలు స్వయంగా నేర్చుకునేలా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు ఆమె ప్రాధాన్యం ఇస్తున్నారు. పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చేయడంతో పాటు, నేర్చుకున్న విషయాలు ఎక్కువకాలం గుర్తుండిపోయేలా సృజనాత్మక పద్ధతులను వినియోగిస్తున్నారు. ఖ్యంగా నృత్య రూపకాలను ఉపయోగించి పాఠాలను బోధించడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది. క్లిష్టంగా అనిపించే అంశాలను పాటలు, నృత్యాలు, కార్యకలాపాలతో అనుసంధానం చేయడం ద్వారా చిన్నారుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. దీంతో తరగతి గదిలో విద్యార్థుల భాగస్వామ్యం పెరగడంతో పాటు, పాఠ్యాంశాలను ఆచరణాత్మకంగా అర్థం చేసుకునే అవకాశం లభిస్తోంది. పాఠశాలలో విద్యార్థులు చేపట్టే వివిధ కార్యక్రమాలను రికార్డు చేసి యూట్యూబ్ ఛానల్ ద్వారా అందుబాటులో ఉంచుతున్నారు. విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు వారి కార్యకలాపాలను తల్లిదండ్రులు, ఇతర ఉపాధ్యాయులు కూడా వీక్షించే అవకాశం కల్పిస్తున్నారు. ఇటీవల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫిన్లాండ్ పర్యటనకు వెళ్లిన 40 మంది ఉపాధ్యాయుల బృందంలో భవాని కూడా ఉన్నారు. ఫిన్లాండ్‌లో అమలవుతున్న ఆధునిక విద్యా విధానాలు, విద్యార్థి కేంద్రిత బోధనా పద్ధతులను ఆమె పరిశీలించారు. అక్కడ నేర్చుకున్న అంశాలను తిరిగి తన పాఠశాలలో అమలు చేస్తూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా బోధనలో మార్పులు తీసుకొస్తున్నారు. గత ఏడాది కూడా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి భవాని పేరు ప్రతిపాదించారు. అయితే ఈసారి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో తన బోధనా విధానం, విద్యార్థుల కోసం చేపడుతున్న కార్యక్రమాలు, విద్యారంగంలో చేసిన ప్రయోగాలను సమర్థంగా వివరించి తాజాగా నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు.

# ఆర్‌ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్‌పై తుమ్మల ఆందోళన

**హైదరాబాద్, మహా:** ఖరీఫ్ సీజన్‌లో యూరియాకు డిమాండ్ పెరిగిన వేళ రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్)లో ఉత్పత్తి నిలిచిపోవడంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆగస్టు 22 నుంచి ప్రారంభమైన షట్‌డౌన్‌తో సుమారు పది రోజుల పాటు యూరియా ఉత్పత్తికి అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు.కేంద్రం తక్షణమే జోక్యం చేసుకుని ప్లాంట్‌ను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని మంత్రి కోరారు. షట్‌డౌన్ సమయంలో రైతులకు కొరత రాకుండా ఇతర దేశీయ ఎరువుల కర్మాగారాల నుంచి అదనపు కేటాయింపులు చేయడంతో పాటు అవసరమైతే దిగుమతుల ద్వారా లోటును భర్తీ చేయాలని కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు.గత ఆర్థిక సంవత్సరంలోనూ సాంకేతిక సమస్యల కారణంగా ఆర్‌ఎఫ్‌సీఎల్ 112 రోజుల పాటు ఉత్పత్తికి దూరంగా ఉన్న విషయాన్ని తుమ్మల గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఖరీఫ్ కీలక దశలో యూరియా సరఫరాలో అంతరాయం రాకుండా ముందస్తు నిల్వలు, ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

**ఢిల్లీ, మహా :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ నూతన జాతీయ పదాధికారులతో సమావేశమయ్యారు. కొత్త ఆలోచనలు, దృక్పథాలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో పార్టీకి ఉన్న సంబంధాలను మరింతగా పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సంస్థాగత సమావేశాలు ఇలాంటి కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశం అనంతరం ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఫొటోలను పంచుకున్నారు. "సంస్థాగత సమావేశాలు పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి కొత్త ఆలోచనలను అందిస్తాయి. కొత్త బృందంతో సమావేశం అద్భుతంగా జరిగింది," అని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రధానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వాగతం పలికారు. ఈ వారం మొదట్లో ప్రకటించిన నితిన్ నబిన్ కొత్త జాతీయ బృందంతో ప్రధాని మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి. కొత్తగా నియమించిన 65 మంది సభ్యుల బృందంలో 51 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించారు. రాబోయే రోజుల్లో చేపట్టబోయే పలు సంస్థాగత, ప్రజా సంబంధ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా యువతతో మమేకం కావడమే లక్ష్యంగా 'యువ సంవాద్' కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 14 ఏళ్లు పైబడిన యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను భారతీయ జనతా యువమోర్చా కు అప్పగించారు.





# లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

( మొదటి పేజీ తరువాయి )

దక్షిణాసియా సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో రామకృష్ణారావు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను రామకృష్ణారావు ఆహ్వానించారు.





**కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటోంది - ఖర్గే ఫైర్**

సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన నేటితో పూర్తవ్వనుంది. ఆయన అమెరికా పర్యటనకు కేంద్రం నో చెప్పడంతో లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. పెట్టుబడుల కోసం వెళ్లే పర్యాటనలను అడ్డుకోవడం ముమ్మాటికీ అన్యాయమేనని ఆయన అభిప్రాయపడ్డారు. బీజేపీ పెద్దలు తమకు కావాల్సిన వారికి అనుమతి ఇస్తారని, తెలంగాణ సీఎంకు మాత్రం విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. అమెరికాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, పెట్టుబడులు వస్తే తెలంగాణతో పాటు దేశానికి కూడా లాభమేనన్నారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పర్యటనలను అడ్డుకుంటోందని ఖర్గే ఆరోపించారు. ముఖ్యమంత్రులు వెళ్లి పెట్టుబడులు తెస్తారనే భయం వారిలో ఉందన్నారు. అన్నీ తమ ద్వారా జరగాలనేది కేంద్రం సంకుచిత ఆలోచన అని ఖర్గే విమర్శించారు.

## ఇదేం ఆత్మనిర్భర్ భారత్?

( మొదటి పేజీ తరువాయి )

లేకుండా దిగుమతి చేసుకునే స్థాయికి మనం ఎలా చేరుకున్నాం?. ఇక రెండోది, మూడు నెలల్లో చక్కెర ధర దాదాపు 40 శాతం పెరిగింది. పండుగలకు ముందు ప్రజలపై ఇంత భారం మోపుతున్న ఈ ధరల పెరుగుదలకు ఎవరు బాధ్యులు? మూడోది, దేశంలో చక్కెర కొరత ఉన్నప్పుడు, ప్రభుత్వం విదేశాల నుంచి చక్కెరను దిగుమతి చేసుకుంటున్నప్పుడు, ఈ20 కోసం ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి చెరకు, ధాన్యాన్ని మళ్లించే విధానాన్ని ఎందుకు సమీక్షించడం లేదు? ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'? అంటూ ఫైర్ అయ్యారు.

## కొండా సుస్మిత లైన్ దాటి ఆరోపణలు చేశారు

**టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్**

**రాజగోపాల్ రెడ్డి హద్దుమీరలేదు**

**నిజామాబాద్, మహా :** మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే సుస్మిత వ్యాఖ్యల వీడియోను కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కొండా సుస్మిత లైన్ దాటి ఆరోపణలు చేశారని అన్నారు. అనిరుధ్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి హద్దు మీరలేదని చెప్పారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు తప్పవని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు.

## పెట్టుబడులకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రాన్ని పెట్టుబడుల కేంద్రంగా ఎంచుకోవాలని ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో నిర్వహించిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్-2026'లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, యువశక్తి, పారదర్శక పాలన అనే నాలుగు స్తంభాలపై తెలంగాణ పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌తో ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని నిలపడమే లక్ష్యమన్నారు. 2025-26లో రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నామని, జాతీయ వృద్ధి రేటు 8 శాతంతో పోలిస్తే తెలంగాణ 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం రాష్ట్ర ఆర్థిక పటిష్టతకు నిదర్శనమని వివరించారు.

# తెలంగాణలో భూ దందాలపై సమగ్ర విచారణ జరపాలి

- **22ఏ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్**
- **ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి**
- **సెప్టెంబరు 17న పరేడ్ గ్రౌండ్స్‌లో హైదరాబాద్ విమోచన దినోత్సవం.**
- **బాధితులకు బీజేపీ లీగల్ సెల్ అండ.**
- **కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి.**





**హైదరాబాద్, మహా :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూదందాలు, సెటిల్‌మెంట్లు పెరిగిపోయాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ నేత జి. కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. 'భూభారతి' పేరుతో ప్రైవేటు భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి సామాన్యులు, రైతులు, బిల్డర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. గత రెండుమూడేళ్లలో 22ఏ జాబితాలో చేర్చిన, తొలగించిన భూములపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంలో బాధితులకు మండల స్థాయి నుంచి హైకోర్టు వరకు బీజేపీ లీగల్ సెల్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. 'ఇమ్రోజ్' పత్రిక సంపాదకుడు, నిజాం-రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా కలంతో పోరాడిన అమరవీరుడు షోయబుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించిన అనంతరం రాష్ట్రంలోని భూ వ్యవహారాలు, రేషన్ బియ్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఓటర్ల జాబితా, హైదరాబాద్ విమోచన దినోత్సవం తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**22ఏ జాబితాపై న్యాయ విచారణ చేయాలి**

తెలంగాణలో భూముల వ్యవహారం అత్యంత సున్నితమైన అంశంగా మారిందని కిషన్‌రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ధరణి పేరుతో జరిగిన భూ అక్రమాలను అంతం చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు 'భూభారతి' పేరుతో మరింత తీవ్రమైన సమస్యలకు దారితీస్తోందని ఆరోపించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో భారీగా ప్రైవేటు భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని, దీనిపై సమగ్ర విచారణ అవసరమని పేర్కొన్నారు.
ప్రభుత్వ, దేవాదాయ, ఇతర నిర్దిష్ట కేటగిరీలకు చెందిన భూములను చట్ట ప్రకారం నిషేధిత జాబితాలో ఉంచే నిబంధనలు ఉన్నప్పటికీ.. దశాబ్దాలుగా పట్టాలు, అనుమతులు, పన్నుల చెల్లింపులతో నివసిస్తున్న ప్రజల ఆస్తులు కూడా వివాదాల్లో చిక్కుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై అధికారికంగా సమగ్ర విచారణ జరిగి వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉంది.
భూ రికార్డుల మార్పులు, 22ఏలో చేర్పులు, తొలగింపులు, రిజిస్ట్రేషన్లపై వచ్చే ఫిర్యాదులను పారదర్శకంగా పరిశీలించాల్సిందేనని కిషన్‌రెడ్డి అన్నారు. బాధితులు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం స్పష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

**బాధితులకు బీజేపీ న్యాయ సహాయం**

భూముల సమస్యలతో బాధపడుతున్న రైతులు, సామాన్యులు, ఆస్తి యజమానులకు బీజేపీ లీగల్ సెల్ అండగా ఉంటుందని కిషన్‌రెడ్డి ప్రకటించారు. మండల స్థాయి అధికారుల నుంచి హైకోర్టు వరకు అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. భూమి రికార్డులు డిజిటలైజ్ అవుతున్న కొద్దీ పారదర్శకత పెరగాల్సిన అవసరం ఉందని, ఒకరి ఆస్తిని మరొకరి పేరుతో మార్చడం, అనుమతుల విషయంలో అధికార దుర్వినియోగం, రాజకీయ ఒత్తిళ్లు వంటి ఆరోపణలకు తావులేకుండా వ్యవస్థ పనిచేయాలని ఆయన అన్నారు.

**రేషన్ బియ్యంపై కేంద్రం పేరు ఎందుకు లేదు?**

ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద పేదలకు అందుతున్న ఉచిత బియ్యం విషయంలోనూ కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు, సబ్సిడీ, రవాణా తదితర అంశాల్లో భారీగా వ్యయం చేస్తోందని పేర్కొంటూ.. కేంద్ర పథకం ద్వారా అందుతున్న బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన పథకంగా ప్రచారం చేసుకోవడం సరికాదని విమర్శించారు.
రేషన్ కార్డులు, రశీదులు, పంపిణీ వ్యవస్థలో కేంద్రం పాత్రను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని కోరారు. కేంద్ర పథకానికి సంబంధించిన గుర్తింపును తొలగించి రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ప్రచారం కల్పించడం సముచితం కాదని అన్నారు. కేంద్ర పథకం ప్రయోజనాలు లబ్ధిదారులకు నేరుగా చేరేలా అవసరమైతే ప్రత్యామ్నాయ విధానాలను పరిశీలిస్తామని హెచ్చరించారు.

**రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి**

తెలంగాణలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కళాశాలలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఫీజులు అందక కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, చదువు పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విద్యా భరోసా కార్డు, విద్యార్థినులకు స్కూటీల వంటి హామీల అమలుపైనా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఓటర్ల జాబితా శుద్ధిపై సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన కిషన్‌రెడ్డి**

ఓటర్ల జాబితా సవరణ, శుద్ధి కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించే రాజ్యాంగబద్ధ ప్రక్రియ అని కిషన్‌రెడ్డి అన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న ప్రాథమిక సూత్రానికి అనుగుణంగా డబుల్ ఎంట్రీలు, మరణించిన వ్యక్తుల పేర్లు, ఇతర తప్పులను తొలగించడం ఎన్నికల సంఘం బాధ్యత అని పేర్కొన్నారు.
ఈ ప్రక్రియను రాజకీయంగా చూడటం సరికాదన్నారు. ఓటర్ల జాబితా మార్పుల పేరుతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం తగదని సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ఎన్నికల జాబితా సవరణలో బూత్ స్థాయి అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కూడా భాగస్వాములేనని.. అలాంటి ప్రక్రియకు కేంద్రాన్ని మాత్రమే బాధ్యుడిని చేయడం సరికాదన్నారు.

**విదేశీ పర్యటనలపై రాజకీయాలు వద్దు**

ముఖ్యమంత్రి, మంత్రుల అధికారిక విదేశీ పర్యటనలకు కేంద్రంలోని విదేశాంగ మంత్రిత్వశాఖ నుంచి అనుమతులు తీసుకోవడం సాధారణ ప్రక్రియ అని కిషన్‌రెడ్డి తెలిపారు. భద్రత, దౌత్యపరమైన అంశాలు, సంబంధిత దేశాలతో సమన్వయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు ఉంటాయని చెప్పారు.కేంద్రం అనుమతి ఇవ్వలేదనే అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చడం తగదన్నారు. గతంలో వివిధ ప్రభుత్వాల సమయంలో కూడా అధికారిక పర్యటనలకు అనుమతులు ఆలస్యమైన లేదా లభించని సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు.

### కాంగ్రెస్ చరిత్రపై తీవ్ర విమర్శలు

ప్రస్తుత రాజకీయ పరిణామాలపై స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ గత చరిత్రను కూడా కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణ ఉద్యమాలు, విద్యార్థుల ఆందోళనలపై కాంగ్రెస్ నాయకులు మాట్లాడే ముందు గతంలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకోవాలని అన్నారు. పార్లమెంట్ వద్ద ఇటీవల జరిగిన నిరసనల్లో ఢిల్లీ పోలీసులు సంయమనంతో వ్యవహరించారని, బాధ్యతగల ప్రతిపక్ష నాయకులు యువతను రెచ్చగొట్టే విధంగా మాట్లాడకూడదని రాహుల్‌గాంధీని ఉద్దేశించి విమర్శించారు.ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన కుటుంబ సభ్యులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన సందర్భాల్లోనూ ప్రభుత్వం వ్యవహరించిన తీరును కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండాలని సూచించారు.

**సెప్టెంబరు 17న పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవం**

హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన సెప్టెంబరు 17, 1948 రోజును పురస్కరించుకుని ఈ ఏడాది కూడా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు.హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబరు 17న భారత యూనియన్‌లో విలీనమైంది. నిజాం పాలనకు ముగింపు పలికిన ఆ పరిణామాన్ని కేంద్ర ప్రభుత్వం 2022 నుంచి అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవంగా నిర్వహిస్తోంది. 2025లోనూ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ ఏడాది కూడా పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలను నిర్వహించనున్నట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. మహారాష్ట్రలో 'మరాఠ్వాడా విమోచన దినోత్సవం', కర్ణాటకలో హైదరాబాద్-కర్ణాటక ప్రాంత విమోచన దినోత్సవం పేరుతో కార్యక్రమాలు జరుగుతున్నాయని, తెలంగాణలోనూ చారిత్రక అంశాలను అధికారికంగా గుర్తించాలని ఆయన కోరారు. అయితే సెప్టెంబరు 17ను ఏ పేరుతో, ఏ రూపంలో నిర్వహించాలన్న అంశంపై తెలంగాణలో రాజకీయ భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం'గా, కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజాపాలన దినోత్సవం'గా నిర్వహించింది. కేంద్రం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా కార్యక్రమం నిర్వహిస్తోంది. షోయబుల్లా ఖాన్ త్యాగాన్ని గుర్తుచేసుకున్న కిషన్‌రెడ్డిరజాకార్ల అరాచకాలు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జర్నలిజం ద్వారా పోరాడిన షోయబుల్లా ఖాన్ త్యాగాన్ని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. 'ఇమ్రోజ్' పత్రిక ద్వారా హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనం కావాలన్న ఆకాంక్షకు ఆయన మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు.చరిత్రలో షోయబుల్లా ఖాన్ పాత్రకు ప్రత్యేక స్థానం ఉందని పలు చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. 1948 ఆగస్టు 22న రజాకార్ల చేతిలో ఆయన హత్యకు గురయ్యారని చారిత్రక రికార్డులు, కిషన్‌రెడ్డి గతంలో రాసిన వ్యాసాలు కూడా పేర్కొన్నాయి. హైదరాబాద్ విమోచన పోరాటంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు చేసిన త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి అన్నారు.

# మెట్రో రెండోదశలో భూగర్భ మార్గాలు

- **విమానాశ్రయాలు, రైల్వే ట్రాక్‌ల వద్ద ప్రత్యేక డిజైన్**
- **రూ.38,595 కోట్లతో మెట్రో రెండోదశ**



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ విస్తరణలో ఇంజినీరింగ్ పరంగా పలు క్లిష్టమైన సవాళ్లను అధిగమించేలా ప్రత్యేక డిజైన్లు రూపొందిస్తున్నారు. రైల్వే ట్రాక్‌లు, జాతీయ రహదారులు, హైటెన్షన్ విద్యుత్ లైన్లు, ఎయిర్‌పోర్టు ప్రాంగణాలు ఉన్న ప్రాంతాల్లో మెట్రో నిర్మాణానికి అనేక అనుమతులు, సాంకేతిక పరిష్కారాలు అవసరం కానున్నాయి. ఈ నేపథ్యంలో రన్‌వే కార్యకలాపాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా హకీంపేట విమానాశ్రయం వద్ద భూగర్భ మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు.జేబీఎస్-శామీర్‌పేట కారిడార్‌లో హకీంపేట విమానాశ్రయం సమీపంలో సుమారు 1.65 కిలోమీటర్ల మెట్రో మార్గాన్ని అండర్‌గ్రౌండ్‌లో నిర్మించాలని ప్రతిపాదించారు. హెచ్ఎండీఏ ప్రతిపాదించిన హైవే టన్నెల్ వెంట ఈ మార్గాన్ని తీసుకెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో విమానాశ్రయ రన్‌వేకు సంబంధించిన పరిమితులను అధిగమించడంతో పాటు భద్రతా ప్రమాణాలను పాటించే అవకాశం ఉంటుంది. నాగోల్-శంషాబాద్ కారిడార్‌లో విమానాశ్రయ పరిధిలో సుమారు 1.6 కిలోమీటర్ల మేర భూగర్భ మెట్రో ప్రతిపాదించారు. విమానాశ్రయ కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఈ మార్గాన్ని డిజైన్ చేయనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రోను విస్తరించే ప్రణాళికలో కార్గో, ఎయిర్‌పోర్ట్ స్టేషన్లతో పాటు విమానాశ్రయ ప్రాంగణంలోనే మెట్రో డిపో ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. దీనికి పౌర విమానయాన మంత్రిత్వశాఖ అనుమతి తప్పనిసరి. బేగంపేట విమానాశ్రయం రన్‌వే కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎత్తు పరిమితులు అమల్లో ఉన్నాయి. విమానాల రాకపోకలకు అవసరమైన ఫన్నెల్ జోన్ నిబంధనలను దృష్టిలో పెట్టుకుని శామీర్‌పేట, మేడ్చల్ కారిడార్లను తక్కువ ఎత్తులో నిర్మించేలా డిజైన్ చేశారు. ఇందుకు సంబంధిత అనుమతుల కోసం అధికారులు చర్యలు చేపడుతున్నారు. రెండోదశలో రైల్వే క్రాసింగ్‌లు కూడా కీలక సవాలుగా మారనున్నాయి. ఫలక్‌నుమా, ఆరాంఘర్, శంషాబాద్, గుండ్లపోచంపల్లి, లోతుకుంట, అల్వాల్ ప్రాంతాల్లో మెట్రో మార్గం రైల్వే ట్రాక్‌లను దాటాల్సి ఉంటుంది. ఈ మార్గాలకు దక్షిణ మధ్య రైల్వే నుంచి సూత్రప్రాయంగా అనుమతి లభించినట్లు అధికారులు తెలిపారు. సుచిత్ర ప్రాంతంలో మాత్రం సంబంధిత అనుమతి ఇంకా అవసరం ఉంది. జాతీయ రహదారుల వెంట కూడా మెట్రో నిర్మాణానికి రైట్ ఆఫ్ వే అనుమతులు కీలకం కానున్నాయి. మదీనాగూడ-పటాన్‌చెరు, చింతలకుంట-హయత్‌నగర్ మార్గాల్లో ఎన్‌హెచ్ 65, ఆరాంఘర్-శంషాబాద్, బోయిన్‌పల్లి-మేడ్చల్ మార్గాల్లో ఎన్‌హెచ్ 44 పరిధిలో మెట్రో స్తంభాల నిర్మాణానికి కేంద్ర రహదారులు, జాతీయ రహదారుల శాఖ అనుమతులు అవసరం. మొత్తంగా రెండోదశలో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో మార్గం, 86 స్టేషన్లు ప్రతిపాదించారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.38,595 కోట్లు కాగా.. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత రోజుకు సుమారు 12.42 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారని అంచనా. ప్రాజెక్టు నిధుల్లో కేంద్రం వాటా రూ.6,666 కోట్లు, రాష్ట్రం వాటా రూ.11,933 కోట్లు, రుణాల ద్వారా రూ.19,996 కోట్లు సమీకరించే ప్రతిపాదన ఉంది. రెండోదశలో జీహెచ్ఎంసీ పరిధిలో 36.5 కి.మీ., మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 24.9 కి.మీ., సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 41.3 కి.మీ. మేర మెట్రో విస్తరించనుంది. హెచ్ఎండీఏ, కంటోన్మెంట్ బోర్డు పరిధిలో రైట్ ఆఫ్ వే అనుమతులు కూడా త్వరగా ఇవ్వాలని మెట్రో అధికారులు కోరుతున్నారు. ఈ అనుమతుల ప్రక్రియ పూర్తయితే నగర రవాణా వ్యవస్థలో రెండోదశ కీలక మలుపుగా మారే అవకాశం ఉంది.

# గచ్చిబౌలిలో అక్రమ భవనాలపై హైడ్రా ఉక్కుపాదం

( మొదటి పేజీ తరువాయి )

సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల తొలగింపులో ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మరో వ్యక్తికి గాయాలైనట్లు అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారేమోనన్న అనుమానంతో రెస్క్యూ బృందాలు సుదీర్ఘంగా గాలింపు చేపట్టాయి. శిథిలాలు పక్కనున్న అపార్ట్‌మెంట్‌పై పడటంతో అక్కడి పలు ఫ్లాట్లు దెబ్బతిన్నాయని, సమీప హాస్టల్‌లోని విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారని పలు వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

**50 గజాల్లో ఏడంతస్తుల నిర్మాణమా?**

ఘటనాస్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్మాణ తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 50 గజాల స్థలంలో ఏడంతస్తుల భవనం నిర్మించడంతోపాటు పైభాగంలో అదనంగా పెంట్‌హౌస్‌ను కూడా నిర్మించినట్లు ప్రాథమిక పరిశీలనలో తేలిందని ఆయన తెలిపారు. నాలాను ఆనుకుని ఉన్న ఇంత చిన్న స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టడం, అవసరమైన సెట్‌బ్యాక్‌లు పాటించకపోవడం, నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించడం వంటి అంశాలు అధికారుల దృష్టికి వచ్చాయి. అయితే భవనం కూలిపోవడానికి ఇదే తుది కారణమని ఇప్పుడే నిర్ధారించడం కంటే, నిర్మాణ అనుమతులు, ప్లాన్ ఆమోదాలు, పునాది సామర్థ్యం, నిర్మాణ నాణ్యత, సెట్‌బ్యాక్‌లు, నాలా పరిధి, అదనపు అంతస్తుల నిర్మాణం వంటి అన్ని అంశాలపై సాంకేతిక దర్యాప్తు జరగాల్సి ఉంది. ప్రమాదానికి అసలు కారణాలను అధికారిక విచారణ స్పష్టం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం అధికారులు మాత్రం నిర్మాణంలో తీవ్ర నిబంధనల ఉల్లంఘనలున్నట్లు ప్రాథమికంగా చెబుతున్నారు.

**'సాజిద్ భవనాలన్నీ ఇలాగే'.. స్థానికుల ఫిర్యాదులు**

ఘటనా స్థలంలో స్థానికులతో మాట్లాడిన రంగనాథ్‌కు బిల్డర్ సాజిద్ నిర్మిస్తున్న ఇతర భవనాలపైనా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఆయన నిర్మించిన భవనాలు కూడా నిబంధనలకు విరుద్ధంగా, నాసిరకం నిర్మాణాలతో ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారని రంగనాథ్ పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై అధికారులు భవనాల వారీగా పరిశీలన చేసి, అనుమతులు, నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలను తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది. ఇలాంటి ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకుంటామని హైడ్రా స్పష్టం చేసింది.




## హైడ్రా చర్యలకు చట్టబద్ధతే కీలకం

అయితే అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌తోపాటు, కూల్చివేతలు చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించేలా చూడాలన్న అంశం కూడా కీలకంగా మారింది. ఇటీవలే తెలంగాణ హైకోర్టు హైడ్రా చర్యల్లో విధివిధానాలు, న్యాయస్థానాల ఆదేశాల అమలుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కొన్ని కేసుల్లో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో హైడ్రా కమిషనర్‌పై న్యాయపరమైన వివాదాలు కూడా కొనసాగుతున్నాయి.అందువల్ల అంజయ్యనగర్‌లో చేపట్టబోయే ప్రత్యేక డ్రైవ్‌లో నిర్మాణాల చట్టబద్ధతను రికార్డుల ఆధారంగా నిర్ధారించడం, సంబంధిత యజమానులకు నోటీసులు, అభ్యంతరాల పరిశీలన, కోర్టు ఆదేశాల అమలు వంటి న్యాయపరమైన అంశాలను పక్కాగా పాటించడం అత్యంత కీలకం. అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎంత కఠినంగా ఉండాలో, అదే స్థాయిలో అవి పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉండాలన్నది ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. హైడ్రా గత చర్యలపై కోర్టుల్లో వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో ఈసారి చేపట్టే చర్యలపై మరింత న్యాయపరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా మారాయి.

**అంజయ్యనగర్‌లో మరిన్ని అక్రమ కట్టడాలున్నాయా?**

ఈ ఘటనతో అంజయ్యనగర్‌లోని ఇతర బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలపై కూడా ప్రశ్నలు తలెత్తాయి. నాలాలపై, నాలాలను ఆనుకుని, తగిన సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మించిన భవనాలు ఈ ప్రాంతంలో అనేకం ఉన్నాయని రంగనాథ్ తెలిపారు. వాటిలో కొన్ని ప్రస్తుతం హాస్టళ్లుగా వినియోగిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదకర స్థితిలో ఉన్న భవనాలను వెంటనే ఖాళీ చేయాలని యజమానులను ఆదేశించారు. ప్రాణాలకు ముప్పు కలిగించే స్థాయిలో భవనాలు ఉన్నట్లయితే వాటిలో నివసించే వారిని ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించడమే ప్రాధాన్యమని అధికారులు సూచిస్తున్నారు.అంజయ్యనగర్‌లో ప్రత్యేక తనిఖీ, ఆక్రమణల గుర్తింపు, నిర్మాణ అనుమతుల పరిశీలన, ప్రమాదకర భవనాల గుర్తింపు వంటి చర్యలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు రంగనాథ్ ప్రకటించారు. నిబంధనలను ఉల్లంఘించిన నిర్మాణాలను ఉపేక్షించేది లేదని, అవసరమైన చోట కూల్చివేతలు చేపడతామని స్పష్టం చేశారు. దీంతో ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే కాకుండా చుట్టుపక్కల ఉన్న బహుళ అంతస్తుల భవనాల యజమానుల్లోనూ ఆందోళన మొదలైంది.

**నాలాల ఆక్రమణలపై మరోసారి దృష్టి**

గచ్చిబౌలి ఘటన మరోసారి హైదరాబాద్‌లో నాలాల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల సమస్యను తెరపైకి తెచ్చింది. నాలాల ప్రవాహ మార్గాలను కట్టడాలతో కుదించడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటమే కాకుండా, భారీ వర్షాల సమయంలో వరద ముప్పు పెరుగుతుంది. హైదరాబాద్‌లో నాలాల ఆక్రమణల తొలగింపు, నీటి ప్రవాహ మార్గాల పునరుద్ధరణను హైడ్రా గతంలోనూ తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా పేర్కొంది.గతంలోనూ నాలాలపై, నీటి ప్రవాహ మార్గాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా తొలగించింది. రామ్నగర్‌లో నాలా, రహదారిని ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలపై చర్యలు తీసుకున్న సందర్భంలో స్థానికుల ఫిర్యాదుల ఆధారంగా పరిశీలన చేసి కూల్చివేతలు చేపట్టినట్లు నమోదైంది. అలాగే పట్నీ ప్రాంతంలో నాలా వెడల్పును అక్రమ నిర్మాణాలు గణనీయంగా తగ్గించడంతో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడిన నేపథ్యంలో ఆక్రమణలు తొలగించిన ఉదాహరణలున్నాయి.

### బిల్డర్ బాధ్యత నుంచి అధికారుల పర్యవేక్షణ వరకు

ఒక చిన్న స్థలంలో భారీ బహుళ అంతస్తుల భవనం ఎలా నిర్మాణ దశకు చేరుకుంది? నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? అనుమతి ఉంటే ఎన్ని అంతస్తులకు ఉంది? వాస్తవంగా ఎన్ని అంతస్తులు నిర్మించారు? నాలా పరిధిలో నిర్మాణం చేపట్టేందుకు ఎవరు అనుమతించారు? నిర్మాణ సమయంలో సంబంధిత అధికారులు తనిఖీలు చేశారా? భవనం నిర్మాణ నాణ్యతను ఎవరు పర్యవేక్షించారు? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.ఇద్దరు కార్మికుల ప్రాణాలను బలిగొన్న ఈ ఘటనను కేవలం ఒక భవనం కూలిన ప్రమాదంగా చూడకుండా, హైదరాబాద్‌లో పెరుగుతున్న అనధికార బహుళ అంతస్తుల నిర్మాణాలపై సమగ్ర సమీక్షకు అవకాశంగా మార్చాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా నాలాలు, నీటి ప్రవాహ మార్గాలు, ఇరుకైన స్థలాలు, అధిక అంతస్తుల నిర్మాణాలు, హాస్టళ్లుగా మారిన అనధికార భవనాలపై ప్రత్యేక భద్రతా ఆడిట్ నిర్వహించాలన్న డిమాండ్ బలపడుతోంది.



# సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక శిశు మందిరాల విద్యా

- ఆకట్టుకున్న గణిత విజ్ఞాన మేళ

**మంచిర్యాల, మహా** : సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక శిశు మందిరాల విద్య అని మంచిర్యాల జిల్లా మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ మేయర్ ధరణి మధుకర్ లు అన్నారు. శనివారం మంచిర్యాల సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విభాగ స్థాయిలో నిర్వహించిన గణిత విజ్ఞానమేలకు ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ విభాగ్ స్థాయి గణిత విజ్ఞాన సంస్కృతి మహోత్సవం కార్యక్రమంలో విభాగ స్థాయిలోని 9 పాఠశాలలకు చెందిన సరస్వతి శిశు మందిరాల నుండి 287 మంది విద్యార్థులు, ప్రబంధ కారిణి పాల్గొని తమ గణిత విజ్ఞాన ప్రదర్శనను ప్రదర్శించి అందర్నీ ఆకట్టుకుందని అన్నారు.విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, గణిత శాస్త్రంలోని అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని వెల్లడించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ గణితం కేవలం పాఠ్యాంశం మాత్రమే కాకుండా, నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే ముఖ్యమైన శాస్త్రమని తెలిపారు. విద్యార్థులు గణితంపై భయాన్ని వీడి, ఆసక్తితో సాధన చేయడం ద్వారా ఉన్నత ఫలితాలను సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సత్తయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్ రావు, ఎంఈఓ మాళవిక దేవి, కార్పొరేటర్లు షేర్ లక్ష్మీ పవన్, చిలువేరు జ్యోతి, సుధమల్ల హరికృష్ణ, విభాగ్ అధ్యక్షులు డాక్టర్ విష్ణువర్ధన్ రావు, కార్యదర్శి దహగాం గోవిందరావు, ఉపాధ్యక్షులు సదాశివ్, సహకార్యదర్శి గుండం అశోక్, కార్యక్రమ నిర్వాహకులు పాఠశాల అధ్యక్షులు చందూరి మహేందర్, కార్యదర్శి గుండా సుధాకర్, కోశాధికారి కొమ్మెర విశ్వేశ్వర శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిని తోపాటు పలువురు పాల్గొన్నారు.





# ముగిసిన ఎస్ఎల్ గౌడ్ అంత్యక్రియలు

- పాడె మోసిన కవ్వంపల్లి,సత్తు
- తరలివచ్చిన అశేష జనం
- శోకసంద్రంగా మారిన మన్నెంపల్లి
- కన్నీటితో వీడ్కోలు పలికిన కాంగ్రెస్ శ్రేణులు

**కరీంనగర్ మహా** : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుధాగోని లక్ష్మీనారాయణ గౌడ్ (ఎస్ఎల్ గౌడ్) అంత్యక్రియలు శనివారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. ఆయన అంతిమ యాత్రకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం తదితరులు ఎస్ఎల్ గౌడ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అంతిమయాత్రలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్వయంగా పాడె మోశారు. అంతిమయాత్రలో చివరి వరకు పాల్గొని ఎస్ఎల్ గౌడ్‌కు కన్నీటితో కడపటి వీడ్కోలు పలికారు.ఈ అంతిమ యాత్రలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే కొండూరు సత్యనారాయణ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి రమేష్, ధ్యావ శ్రీనివాస్ రెడ్డి, బండారి తిరుపతి, బొడ్డు సునీల్, లింగాల శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నందగిరి రవీంద్రచారి, ప్రధాన కార్యదర్శి ముసుకు ఉపేందర్ రెడ్డి, దావు సంపత్ రెడ్డి, సహకార సంఘాల చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, ఒగ్గు దామోదర్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, రొంటాల లక్ష్మారెడ్డి, కీసర సంపత్, గాజుల మహేష్, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పార్టీ నాయకులు పొట్ట శ్రీనివాస్, పోతుగంటి శ్రీనివాస్, టి.కిరణ్,మేడి అంజయ్య,జె.సంపత్, టి.కొమురయ్య, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కుంట రాజేందర్ రెడ్డి, శ్రీగిరి రంగారావు, మామిడి అనిల్ కుమార్, పులి కృష్ణ, మర్రి ఓదెలు యాదవ్,బుధారపు శ్రీనివాస్, కందుల అశోక్ రెడ్డి, నాంపల్లి తిరుపతి, పులి ఆంజనేయులు, పొన్నం సత్యనారాయణ గౌడ్, పొన్నం రవిచంద్ర,కటకం వెంకటరమణ, పదాల శంకరయ్య, చెప్యాల శ్రీనివాస్ గౌడ్,మాచర్ల అంజయ్య, గొట్టిముక్కుల సంపత్ రెడ్డి, పోలు రాము, రమేష్, రెడ్డిగాని రాజు,రాములు యాదవ్, మన్మోహన్ రావు, రేవెల్లి రాజలింగం,కొరివి అరుణ్ కుమార్, బుర్ర శ్రీధర్ గౌడ్ తోపాటు వివిధ గ్రామాల్లో సర్పంచులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నన్ను టార్గెట్ చేస్తున్నవారిపై చర్యలు తీసుకోండి

**.. మంత్రి కొండా సురేఖ మరో లేఖ**

**హైదరాబాద్, మహా** : తనపై, తన కుటుంబ సభ్యులపై కొందరు పార్టీ నాయకులు క్రమబద్ధంగా జరుపుతున్న దాడుల వెనుక అదృశ్య హస్తం ఉందంటూ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం టిపిసిసిక్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవికి లేఖ రాశారు.టిపిసిసి క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ ఇచ్చానని, పార్టీ క్రమశిక్షణపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి పేర్కొన్నారు. నోటీసును ఉపసంహరించుకోవాలని కోరినప్పటికీ విమర్శలు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు సీఎల్పీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మహిళా నేతలు ఒకే తరహాలో తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారని లేఖలో తెలిపారు. ఇది స్వతంత్రంగా చేస్తున్న వ్యాఖ్యలు కాదని, వెనుక ఉండి ఎవరో ప్రేరేపిస్తూ, నిర్దేశిస్తున్నట్లు అనుమానం కలుగుతోందని ఆరోపించారు.

# డీఎస్సీపై జగన్‌కు లోకేశ్ ఐదో సవాల్

- 'టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.
- చర్చకు నేను సిద్ధం'.
- విజయనగరం టీడీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పిలుపు.



**విజయనగరం, మహా** : డీఎస్సీ అంశంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మరోసారి సవాల్ విసిరారు. డీఎస్సీపై తనతో బహిరంగ చర్చకు రావాలని జగన్‌ను కోరుతూ ఇప్పటికే పలుమార్లు సవాల్ చేసిన లోకేశ్.. శనివారం విజయనగరంలో మరోసారి అదే అంశాన్ని ప్రస్తావించారు. 'టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.. చర్చకు నేను సిద్ధం' అంటూ జగన్‌కు ఐదోసారి సవాల్ విసిరారు. డీఎస్సీ నియామకాలు, ఉపాధ్యాయ పోస్టులు, గత ప్రభుత్వ హయాంలో నియామక ప్రక్రియపై ఉన్న సందేహాలపై బహిరంగంగా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.విజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్.. పార్టీ బలోపేతం, ప్రభుత్వ కార్యక్రమాలు, ఉత్తరాంధ్ర అభివృద్ధి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణుల సన్నద్ధత తదితర అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

**కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక**

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని లోకేశ్ అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన కార్యకర్తలను ఎప్పటికీ మరచిపోమని స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, గౌరవం, బాధ్యతలు కల్పించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన వారికి భవిష్యత్తులో తగిన అవకాశాలు కల్పించే విషయంలో నాయకత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు.టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం ఇప్పటివరకు రూ.160 కోట్లు ఖర్చు చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని ఆయన అన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటాయనే నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రాధాన్యం**

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని తెలిపారు. యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా పెట్టుబడులను ఆకర్షించాల్సిన అవసరం ఉందన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, మన్యం జిల్లాలతో కూడిన ఉత్తరాంధ్రలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం ద్వారా ఈ ప్రాంత ఆర్థిక సామర్థ్యాన్ని మరింత పెంచుతామని లోకేశ్ పేర్కొన్నారు. రహదారులు, విద్య, పరిశ్రమలు, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.

**స్థానిక ఎన్నికలే తదుపరి లక్ష్యం**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని లోకేశ్ సూచించారు. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచాలని, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని చెప్పారు.కూటమి భాగస్వామ్య పార్టీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి కేవలం నాయకుల ప్రచారం మాత్రమే కాకుండా ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం కావడం కీలకమని స్పష్టం చేశారు.

### డీఎస్సీపై రాజకీయ సమరం

డీఎస్సీ నియామకాలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి ప్రధాన చర్చనీయాంశంగా మారాయి. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ, పోస్టుల సంఖ్య, నియామక ప్రక్రియ వంటి అంశాలపై అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే జగన్‌తో బహిరంగ చర్చకు సిద్ధమని లోకేశ్ మరోసారి సవాల్ చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.జగన్ సమయం, తేదీ ఖరారు చేస్తే తాను చర్చకు సిద్ధమని లోకేశ్ స్పష్టం చేయడం ద్వారా డీఎస్సీ అంశంపై తన వాదనను ప్రజల ముందే నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నానన్న సంకేతాన్ని ఇచ్చారు. దీంతో రానున్న రోజుల్లో డీఎస్సీ వ్యవహారం మరింత రాజకీయ వేడిని రాజేసే అవకాశం కనిపిస్తోంది.

# వృద్ధుల ముసుగులో గంజాయి రవాణా

- ఐదుగురు అరెస్ట్
- 38 కిలోల డ్రై గంజాయి స్వాధీనం
- విలువ రూ.10 లక్షలు

**హైదరాబాద్, మహా** : వయసు పైబడిన ప్రయాణికులపై సాధారణంగా అనుమానం తక్కువగా ఉంటుందనే విషయాన్ని ఆసరాగా చేసుకుని గంజాయిని రవాణా చేస్తున్న ఐదుగురిని హైదరాబాద్ సీసీఎస్ ప్రత్యేక క్రైమ్ టీమ్, గాంధీనగర్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 38 కిలోల డ్రై గంజాయిని, దీని విలువ దాదాపు రూ.10 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆగస్టు 21న విశ్వసనీయ సమాచారం అందడంతో సీసీఎస్ క్రైమ్ టీమ్, గాంధీనగర్ పోలీసులతో కలిసి దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకుంది. అరెస్టైన వారిలో రాజారాం స్వామి కన్ను పడయాచి (78), సంతోష్ బాలారం ప్రజాపతి (65), విజయలక్ష్మి కలియమూర్తి పిల్లై (66), సిల్మినా కుజూర్ (36), షీలా దేవి (48) ఉన్నారు. వీరిలో కొందరు కూలీలు, మరికొందరు గృహ సహాయకులుగా పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**అరకు నుంచి హైదరాబాద్ మీదుగా ముంబైకి..**

పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు విశాఖపట్నం జిల్లా అరకు ప్రాంతం నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని సేకరించి, బ్రౌన్ కలర్ పార్సిల్ కవర్లలో ప్యాక్ చేసేవారు. అనంతరం బస్సుల్లో గంజాయి పార్సిళ్లను హైదరాబాద్‌కు తరలించి, ఇక్కడ మరో బస్సు ఎక్కి ముంబైకి వెళ్లేవారు. అక్కడ ముందుగా సూచించిన ప్రాంతాల్లో గంజాయి పార్సిళ్లను అప్పగించేవారు.

**వయసును అడ్డుపెట్టుకుని..**

వృద్ధ ప్రయాణికులపై అనుమానం తక్కువగా ఉంటుందనే విషయాన్ని అక్రమ రవాణా నిర్వాహకులు తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు అరకు నుంచి బయలుదేరే సమయంలో పార్సిళ్లను తమ సాధారణ సామాన్లతో కలిపి తీసుకెళ్లేవారు. అనుమానం రాకుండా హైదరాబాద్ చేరుకున్న తర్వాత కొంతసేపు వేరే లాడ్జిలో బస చేసి, ముందుగా నిర్ణయించిన మరో బస్సులో ముంబైకి వెళ్లేవారని పోలీసులు తెలిపారు. ప్రతి డెలివరీకి నిందితులకు సుమారు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు కమీషన్ చెల్లించేవారని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

**గతంలోనూ గంజాయి రవాణా?**

అరెస్టైన నిందితులకు గతంలోనూ గంజాయి రవాణాకు సంబంధించిన నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న ప్రధాన వ్యక్తి ఎవరు? అరకు నుంచి గంజాయిని సరఫరా చేస్తున్న నెట్‌వర్క్ ఎంత విస్తరించింది? ముంబైలో పార్సిళ్లను స్వీకరిస్తున్న వ్యక్తులు ఎవరు? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.ఈ ఆపరేషన్‌ను సీసీఎస్ క్రైమ్ టీమ్ ఇన్‌స్పెక్టర్ చి. సుధాకర్ రావు, ఎస్ఐ ఎన్. గౌరేందర్ గౌడ్ తమ సిబ్బందితో కలిసి గాంధీనగర్ పోలీసుల సమన్వయంతో నిర్వహించారు. డీసీపీ, సీసీఎస్ ఎస్. చైతన్య కుమార్, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### ప్రజలకు పోలీసుల హెచ్చరిక

గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయం లేదా పంపిణీలో ఎవరూ భాగస్వాములు కావొద్దని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. డబ్బు కోసం క్యారియర్‌లుగా వ్యవహరించినా ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘాను మరింత పెంచి, నెట్‌వర్క్‌లోని ఇతర వ్యక్తులను కూడా గుర్తించి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

ANN తెలుగు

మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్

22-08-2026

మహా ప్రత్యేకం



# తెలంగాణ సర్కార్ అల్పాహార విప్లవం

- దేశంలోని తొలిసారి.. రుచికర పథకం
- ప్రతిరోజూ 20లక్షలమందికి అల్పాహారం
- అమలులో కీలకంగా వ్యవహరిస్తున్న 'హరే కృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్

(మహా ప్రత్యేకం)

ఆకలితో ఉన్న చిన్నారి మనసు చదువుపై ఎలా లగ్నం చేయగలదు?" ఇదే ప్రశ్నతో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బృహత్తర కార్యక్రమం 'తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలల అల్పాహార పథకం'. దేశంలోనే తొలిసారిగా ప్రీప్రైమరీ స్థాయి నుంచి జూనియర్ కళాశాల వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఉచితంగా, రుచికరమైన, పరిశుభ్రమైన అల్పాహారాన్ని అందిస్తున్న ఈ మహోన్నత పథకం నేడు రాష్ట్రంలోని లక్షలాది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ప్రీప్రైమరీ స్థాయి నుంచి జూనియర్ కళాశాల వరకు విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి రుచికరమైన, పౌష్టికాహారంతో కూడిన ఉచిత అల్పాహారాన్ని అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఏకంగా రూ. 800 కోట్లను కేటాయించి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసింది. ఆకలితో అల్లాడే చిన్నారి మెదడు చదువును ఒంటబట్టించుకోలేదనే మహా సత్యం నుండి పుట్టిందే ఈ అక్షర అమృత యజ్ఞం. తెలంగాణ గడ్డపై నేడు అక్షరంతో పాటు అమృతం కూడా ఉదయిస్తోంది. తెలంగాణ ప్రభుత్వ సంకల్పం, హరే కృష్ణ మూవ్మెంట్ సేవా తత్పరతల సంగమం — రేపటి పౌరుల బంగారు భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తోంది.

## ముఖ్యమంత్రి నిర్ణయం గొప్పది



"తెలంగాణలో ఏ విద్యార్థి కూడా ఖాళీ కడుపుతో పాఠశాలకు వెళ్లకూడదు" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తెలంగాణ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం చాలా గొప్పది. ఈ నిర్ణయం ఒక గొప్ప లక్ష్యంగా మారి తెలంగాణ స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని అమలు చేసే అవకాశం హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ కు ఇచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ 20 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారం అందుతుంది. ఈ స్థాయిలో విద్యార్థులకు ప్రతిరోజూ బ్రేక్‌ఫాస్ట్ అందించే కార్యక్రమం భారతదేశంలోనే ప్రత్యేకమైనది. భవిష్యత్తులో ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌గా నిలిచే అవకాశం ఉంది. మా సెంట్రలైజ్డ్ వంటశాలల్లో ప్రత్యేకంగా రూపొందించిన యంత్రాలను ఉపయోగిస్తూ, మా సిబ్బంది ప్రతిరోజూ ఉదయం వేడి, తాజా, పరిశుభ్రమైన అల్పాహారాన్ని లక్షలాది మంది పిల్లలకు సమయానికి అందిస్తున్నారు. ఈ రోజు మంచి పోషకాహారం పొందే పిల్లలే రేపటి భారతదేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారు.

**- హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్య గౌర చంద్ర దాస ప్రభుజీ**



**రుచికరమైన మరియు పౌష్టికాహార మెను**

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సిఫార్సుల మేరకు, పిల్లల వయసుకు తగినట్లుగా ఈ మెను రూపొందించబడింది. ప్రతిరోజూ మారుతున్న రుచులు పిల్లలకు ఆనందాన్ని ఇస్తున్నాయి:

| వారం | అల్పాహార మెను |
|---|---|
| సోమవారం | ఇడ్లీ సాంబార్ (పాలతో సహా) |
| మంగళవారం | పూరి ఆలు కుర్మా |
| బుధవారం | దోశ చట్నీ |
| గురువారం | ఉప్మా చట్నీ (పాలతో సహా) |
| శుక్రవారం | మిల్లెట్ ఇడ్లీ సాంబార్ |
| శనివారం | బోండా చట్నీ |

## విజయవంతమైన ప్రస్థానం - ప్రాంతాలవారీగా విస్తరణ

కొడంగల్ పైలట్ ప్రాజెక్ట్: వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో మొదటగా ప్రారంభించిన ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమై హాజరు శాతాన్ని 75% నుంచి 90%కి పెంచింది. నేడు ఇది రాష్ట్రవ్యాప్త విస్తరణకు రోడ్డు మ్యాప్ అయింది. నార్సింగి కిచెన్: నార్సింగి కిచెన్ ద్వారా విద్యార్థులతో పాటు, జీహెచ్ఎంసి భాగస్వామ్యంతో 'ఇందిరమ్మ క్యాంటీన్లు' పేదల ఆకలి తీరుస్తున్నాయి. కేవలం రూ. 5లకే నాణ్యమైన భోజనం, అల్పాహారం అందించబడుతోంది. వరంగల్, మధిర, కంది మెగా కిచెన్‌లు: వరంగల్, మధిర, కంది (సంగారెడ్డి) తదితర కేంద్రాల ద్వారా వేలాది ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రతిరోజూ వేడివేడి అల్పాహారం అందుతోంది. నిరుపేద విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు పూయిస్తూ, ఏ ఒక్క బిల్లా ఆకలితో చదువు ఆపకూడదనే మహోన్నత ఆశయంతో సాగుతున్న ఈ ప్రయాణం తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోంది.

## పథకం ముఖ్యాంశాలు

బడ్జెట్ కేటాయింపులు: ఈ ఏడాది బడ్జెట్‌లో తెలంగాణ ప్రభుత్వం ఈ పథకం కోసం రూ. 800 కోట్లను కేటాయించింది. లక్ష్యం: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 23,106 పాఠశాలల్లో దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందించడమే ప్రభుత్వ ధ్యేయం. అమలు భాగస్వామి: ఈ అద్భుత కార్యక్రమానికి 'హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ' ప్రధాన అమలు భాగస్వామిగా ్యవహరిస్తోంది. ప్రధాన లక్ష్యం: బడి పిల్లల్లో ఆకలిని నివారించడం, పౌష్టికాహార లోపాన్ని తరిమికొట్టడం, తరగతి గదుల్లో ఏకాగ్రతను పెంచడం మరియు పాఠశాలలకు హాజరు శాతాన్ని మెరుగుపరచడం ఈ పథకం ముఖ్య ఉద్దేశాలు.
























# కిష్టారం ఓసీని సందర్శించిన సింగరేణి డైరెక్టర్ పి&పి కొప్పుల వెంకటేశ్వర్లు

- కార్మికులతో కలిసి మధ్యాహ్న భోజనం.. క్యాంటీన్ సౌకర్యాలపై ఆరా

**సత్తుపల్లి, ఆగస్టు 22: మహా :** సింగరేణి సత్తుపల్లి ఏరియాలోని కిష్టారం ఓపెన్‌కాస్ట్ (ఓసీ) గనిని సింగరేణి డైరెక్టర్ పి&పి కొప్పుల వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ వెంకటాచారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ, మేనేజర్ రామకృష్ణ తదితర అధికారులతో కలిసి ఓసీలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కిష్టారం ఓసీ క్యాంటీన్‌లో కార్మికులతో కలిసి డైరెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లోని వసతులు, కార్మికులకు అందుతున్న భోజనం, ఇతర సౌకర్యాలపై కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ప్రతిరోజూ నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ వారికి అందుతున్న సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ సూర్యప్రకాష్, అధికారులు, కార్మికులు, డీఎల్ఆర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కులు.. చట్టాలపై అవగాహన అవసరం

- రాజ్యాంగ విలువలు, ప్రాథమిక విధులను తెలుసుకోవాలి
- క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో భవిష్యత్తును దెబ్బతీసుకోవద్దు..
- మణుగూరు మెజిస్ట్రేట్ సూరి రెడ్డి




**మణుగూరు, మహా :** విద్యార్థులు చదువుతో పాటు రాజ్యాంగ విలువలు, ప్రాథమిక విధులు, తమ హక్కులు, బాధ్యతలు, బాలల రక్షణకు అమలులో ఉన్న చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని మణుగూరు మండల న్యాయ సేవా కమిటీ ఛైర్మన్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి సూచించారు. శనివారం మణుగూరులోని తెలంగాణ గిరిజన సంక్షేమ ఉన్నతీకరించిన రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలికలు)లో నిర్వహించిన న్యాయ అవగాహన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రాజ్యాంగం పౌరులకు హక్కులతో పాటు దేశ సమగ్రతను కాపాడటం, ఇతరులను గౌరవించడం, ప్రజా ఆస్తులను పరిరక్షించడం వంటి ప్రాథమిక విధులను కూడా నిర్దేశించిందని వివరించారు. బాలలకు విద్య, భద్రత, గౌరవప్రదమైన జీవనం హక్కులని, వారిపై హింస, వేధింపులు, దోపిడీ జరిగితే చట్టపరమైన రక్షణ పొందవచ్చని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం బాలికకు 18 ఏళ్లు, బాలుడికి 21 ఏళ్లు నిండకముందు వివాహం చేయడం చట్టవిరుద్ధమని చెప్పారు. బాలలను ప్రమాదకరమైన పనుల్లో నియమించడం, వారి చదువుకు ఆటంకం కలిగేలా శ్రమకు గురిచేయడం చట్టరీత్యా నేరమని వివరించారు. పోక్సో చట్టం కింద 18 ఏళ్లలోపు బాలబాలికలను లైంగిక వేధింపులు, దాడులు, అసభ్య ప్రవర్తన నుంచి ప్రత్యేక రక్షణ కల్పిస్తుందని తెలిపారు. తమకు ఎదురయ్యే వేధింపులను భయంతో దాచకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా విశ్వసనీయ పెద్దల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. సోషల్ మీడియా వినియోగంలోనూ వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వివరించారు. అనంతరం మణుగూరు న్యాయవాదులు పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీనేజ్‌లో భావోద్వేగాలు, క్షణికావేశం ప్రభావంతో తీసుకునే నిర్ణయాలు ఒక్కోసారి చట్టపరమైన సమస్యలకు దారితీస్తాయని వివరించారు. ఆ వయసులో తాము భావించేదే సరైనదనే భ్రమకు లోను కాకుండా, ఏదైనా కీలక నిర్ణయం తీసుకునే ముందు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బాధ్యతగల పెద్దల సలహా తీసుకోవాలని సూచించారు. చిన్న వయసులో చేసే పొరపాటు చదువు, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున భావోద్వేగాల కంటే విచక్షణ, పరిపక్వతతో వ్యవహరించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. శిబిరంలో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురు కృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, న్యాయవాదులు సావిత్రి, నరసింహారావు, భాస్కర్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ రాణి, ఎంఎల్ఎస్సీ కోఆర్డినేటర్ రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా

**క్యాతనపల్లి మహా :** పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనలను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని క్యాతనపల్లి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ ఆరోపించారు. కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకే ప్రభుత్వం విద్యా సంస్కరణలు చేపడుతోందన్నారు. మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద విద్యార్థులతో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం అభినందనీయమన్నారు. మంత్రి వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు వక్రీకరించి అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. డిప్లొమా విద్యార్థులకు బీటెక్ రెండో సంవత్సరంలో లెటరల్ ఎంట్రీ అవకాశం కొనసాగుతుందని, విద్యార్థులకు నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. విద్యార్థులను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించకుండా నిర్మాణాత్మక సూచనలు చేయాలని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆపదలో అండగా సింగరేణి ఉద్యోగులు

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన అప్రెంటిస్‌కు రూ.20 వేల సాయం..
- సింగరేణి ఉద్యోగుల సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం : డీసీ సెక్షన్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్

**మణుగూరు, మహా :** రోడ్డు ప్రమాదంలో గాయపడి మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సింగరేణి ఐటీఐ అప్రెంటిస్ రవి కిషోర్‌కు సింగరేణి ఉద్యోగులు అండగా నిలిచారు. పీకే ఓసీ-2 డీసీ ఎలక్ట్రికల్ సెక్షన్ బేస్ వర్క్‌షాప్ విభాగం ఉద్యోగులు రవి కిషోర్‌ను పరామర్శించి, ఆయన కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీసీ సెక్షన్ ఇన్‌చార్జ్ కే శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ చేస్తున్న సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. అనుకోని ప్రమాదాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు చేతనైన సహాయం అందించడం సామాజిక బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. రవి కిషోర్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన ఉద్యోగులకు రవి కిషోర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డి వెంకటేశ్వర్, జానకి ప్రసాద్, జె. కరుణాకర్, ఎండీ హబీబుద్దీన్, చంద్రకుమార్, వై వెంకటేశ్వర్లు, సందీప్, నాగరాజ్, నరేందర్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జెన్‌జీ వైపు వెలిచాల చూపు.. కరీంనగర్ కార్పొరేషన్‌పై ‘వాచ్‌డాగ్’ నిఘా!

- అవినీతికి చెక్ పెట్టేందుకు సరికొత్త కార్యాచరణ.. 40–50 మందితో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ

**కరీంనగర్ మహా :** కరీంనగర్ నగర పాలక సంస్థలో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ.. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, నాణ్యతకు పెద్దపీట వేసే దిశగా కొత్త కార్యాచరణ రూపుదిద్దుకుంటోంది. కార్పొరేషన్ పరిధిలో జరిగే ప్రతి అభివృద్ధి పనిపై నిఘా పెట్టడంతో పాటు టౌన్ ప్లానింగ్, భవన నిర్మాణ అనుమతులు, టెండర్లు, ఇతర పరిపాలనా వ్యవహారాలను నిరంతరం పర్యవేక్షించేలా ‘జెన్‌జీ వాచ్‌డాగ్’ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు నిర్ణయించారు. నగర పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, అవినీతి జరిగే అవకాశాలను ముందుగానే గుర్తించడం, ప్రజలకు సంబంధించిన వ్యవహారాల్లో జవాబుదారీతనాన్ని పెంచడం ఈ కొత్త వ్యవస్థ ప్రధాన లక్ష్యంగా ఉండనుంది. సుమారు 40-50 మందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి కార్పొరేషన్ కార్యకలాపాలను పరిశీలించేలా కార్యాచరణ రూపొందుతోంది.

**జెన్‌జీతో కొత్త తరహా నిఘా**

సాధారణ రాజకీయ పర్యవేక్షణకు భిన్నంగా న్యాయ, సమాచార హక్కు, సాంకేతిక రంగాల నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ కార్యక్రమంలో కీలక అంశంగా మారనుంది. యువ లాయర్లు, ఆర్టీఐ కార్యకర్తలు, ఐటీ ప్రొఫెషనల్స్, సామాజిక అంశాలపై అవగాహన ఉన్న యువతను బృందంలో భాగస్వాములను చేయనున్నారు.

దీంతో కార్పొరేషన్‌లోని వ్యవహారాలను కేవలం రాజకీయ కోణంలో కాకుండా చట్టపరంగా, సమాచారపరంగా, సాంకేతికంగా పరిశీలించే అవకాశం ఏర్పడనుంది. అవసరమైన సమాచారాన్ని ఆర్టీఐ ద్వారా సేకరించడం, అందుబాటులో ఉన్న ప్రభుత్వ రికార్డులను పరిశీలించడం, అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో గమనించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ**

కార్పొరేషన్ పరిధిలో చేపట్టే రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, స్ట్రీట్‌లైట్లు, ఇతర మౌలిక వసతుల పనులపై వాచ్‌డాగ్ ప్రత్యేక దృష్టి పెట్టనుంది. పనుల మంజూరు నుంచి టెండర్లు, అంచనాలు, పనుల అమలు, నాణ్యత, పూర్తయిన తర్వాత పరిస్థితి వరకు వివిధ దశల్లో పర్యవేక్షణ ఉండేలా వ్యవస్థను రూపొందించనున్నారు. ప్రజాధనం ఖర్చవుతున్న ప్రతి అభివృద్ధి పని నిబంధనలకు అనుగుణంగా, నాణ్యతతో జరుగుతుందా లేదా అన్నది పరిశీలించడం ద్వారా లోపాలను గుర్తించే అవకాశం ఉంటుంది. పనుల్లో జాప్యం, నాణ్యత లోపాలు, నిబంధనల ఉల్లంఘనలు వంటి అంశాలు వెలుగులోకి వస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే విధంగా కార్యాచరణ ఉండనుంది.

**టౌన్ ప్లానింగ్‌పైనా నజర్**

కార్పొరేషన్‌లో ప్రజలకు అత్యంత సంబంధం ఉన్న టౌన్ ప్లానింగ్ వ్యవహారాలపైనా వాచ్‌డాగ్ దృష్టి సారించనుంది. భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్లు, ఇతర అనుమతుల ప్రక్రియలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా.. అనుమతుల జారీ వ్యవహారాల్లో పారదర్శకత ఉందా అనే అంశాలను పరిశీలించే అవకాశం ఉంది. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా జరిగే కార్యకలాపాలపై కూడా సమాచారం సేకరించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే విధంగా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు.

**ప్రజల ఫిర్యాదులకు ప్రత్యేక అవకాశం**

‘జెన్‌జీ వాచ్‌డాగ్’లో మరో కీలక అంశం ప్రజల భాగస్వామ్యం. కార్పొరేషన్ పరిధిలో ఎక్కడైనా అవినీతి, అక్రమాలు, నాణ్యత లేని అభివృద్ధి పనులు, అనుమతుల విషయంలో అవకతవకలు లేదా ఇతర సమస్యలు ఎదురైతే ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించనున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కేవలం స్వీకరించడమే కాకుండా వాటిపై వాస్తవాలను పరిశీలించి, సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం జరిగే వరకు పర్యవేక్షించే విధంగా వ్యవస్థను రూపొందించనున్నారు. ఆధారాలతో వచ్చే ఫిర్యాదులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**రాజకీయాలకు అతీతంగా ప్రజా పర్యవేక్షణ**

కార్పొరేషన్‌లో పాలనను రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణల స్థాయిని దాటి ప్రజా పర్యవేక్షణ పరిధిలోకి తీసుకురావాలన్న ఆలోచనలో భాగంగానే ఈ కొత్త వ్యవస్థకు రూపకల్పన జరుగుతోంది. ఎవరు అధికారంలో ఉన్నా.. ప్రజాధనంతో జరిగే పనులపై ప్రజలకు జవాబుదారీతనం ఉండాలన్నదే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించే జెన్‌జీ యువతను నగర పాలనలో భాగస్వాములను చేయడం ద్వారా పాత తరహా పర్యవేక్షణకు భిన్నమైన విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నం జరుగుతోంది.



**కరీంనగర్‌లో కొత్త తరహా రాజకీయ కార్యాచరణ**

ఇప్పటివరకు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై రాజకీయ నేతలు స్పందించడం సాధారణంగా కనిపించేది. అయితే కార్పొరేషన్ స్థాయిలో జరిగే ప్రతి అంశాన్ని నిరంతరం పరిశీలించే ప్రత్యేక పర్యవేక్షణ బృందం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కరీంనగర్ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపుతోంది. యువ లాయర్లు, ఆర్టీఐ కార్యకర్తలు, ఐటీ నిపుణులు, సామాజిక కార్యకర్తలు కలిసి పనిచేసే ఈ ‘జెన్‌జీ వాచ్‌డాగ్’ కార్యరూపం దాల్చితే.. నగర పాలనలో ప్రజల పర్యవేక్షణకు కొత్త వేదికగా మారే అవకాశం ఉంది. అభివృద్ధి పనుల నుంచి అనుమతుల వరకు.. అవినీతి అనుమానం నుంచి ప్రజల ఫిర్యాదుల వరకు.. కార్పొరేషన్ వ్యవహారాలపై నిరంతర నిఘా ఉండేలా ఈ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది. కరీంనగర్ నగర పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ‘జెన్‌జీ వాచ్‌డాగ్’ ప్రతిపాదన ఇప్పుడు నగరంలో హాట్ టాపిక్‌గా మారింది.



# ఆధునిక వ్యవసాయ పద్ధతులతోనే అధిక దిగుబడులు

**పాలకుర్తి ఆగస్టు 22 మహా :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలో వ్యవసాయ శాఖ మరియు రైతు విజ్ఞాన కేంద్రం పెద్దపల్లి సంయుక్త ఆధ్వర్యంలో 'ఆత్మ పథకం కింద శుక్రవారం పాలకుర్తి మండలంలోని మూడు గ్రామాల్లో రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సంపత్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాయి. కన్నాల గ్రామంలో పొలాల్లో జీవ ఎరువుల వాడకంపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. భూమిలో భాస్వరం లభ్యతను పెంచే ఫాస్ఫరస్ సాల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా' పీఎస్‌బీ ని వరి మరియు పత్తి పంటల్లో ఎలా వాడాలో శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో చేసి చూపించారు. విత్తన శుద్ధి చేసే విధానం, నేలలో వేసే పద్ధతులను వివరించడం ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. పుట్నూర్ గ్రామంలో అధిక సాంద్రత పత్తి సాగు విధానంపై అవగాహన కల్పించారు. రసం పీల్చే పురుగులను ముందస్తుగా గుర్తించేందుకు పసుపు జిగురు అట్టల వినియోగాన్ని ప్రదర్శించి, రైతులకు ఉచితంగా అందజేశారు. అలాగే, పత్తిలో పూత, కాయ నిలకడ కోసం పెరుగుదల నిరోధక మందు మెపిక్వాట్ క్లోరైడ్ పిచికారీ ప్రాముఖ్యతను వివరించారు. కుక్కల గూడూరు గ్రామంలో పత్తి పంటపై డ్రోన్ ద్వారా నానో యూరియా, నానో డీఏపీ, నానో పొటాష్ ద్రావణాల పిచికారీని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. డ్రోన్ టెక్నాలజీ వల్ల 90 శాతం నీరు, సమయం మరియు కూలీల ఖర్చు ఆదా అవుతుందని వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కుక్కల గూడూరు సర్పంచ్ మేడం దేవమ్మ బాపు మాట్లాడుతూ. రైతులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పద్ధతులను పాటిస్తూ లాభసాగు వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మూడు గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో సుమారు 45 మంది రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సంపత్, సర్పంచ్ దేవమ్మ బాపు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఏఈఓ ఎం. సువర్ణరేఖ, కే. శ్రీకాంత్, జే. సుష్మతో పాటు స్థానిక సన్న, చిన్నకారు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బల్దియా లో దోచుకున్న వారికి దోచుకున్నంత

**వరంగల్, మహా :** వరంగల్ బల్దియా లో దోచుకున్న వారికి దోచుకున్నంతగా మారింది. ఒక్కో విభాగంలో ఒక్కో విధంగా అవినీతి రాజ్యమేలుతోందని ఉద్యోగులు సిబ్బంది మధ్య గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పనులు చేయకుండానే బిల్లులు ఆమోదించినట్లు అలాగే ప్రొసీడింగ్స్ లేకుండానే పనులు చేసినట్లు రికార్డులు.. ముందుగానే కమీషన్లు.. ఆ తర్వాత భారీగా బిల్లులు.. ఇదీ బల్దియా లో కొందరు అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సాగినట్లు ఆరోపణల వ్యవహారం బహిర్గతం అవుతున్నాయి. కొన్నేళ్ల క్రితం జరిగిన ఈ బాగోతం తాజాగా వెలుగులోకి రావడంతో బల్దియా వర్గాల్లో ఇప్పుడు ఇది హాట్ టాపిక్ గా మారింది. పనులు చేయకున్నా బిల్లులు ఇప్పిస్తామంటూ కాంట్రాక్టర్లను ఆకర్షించి, అందులో నుంచి ముందుగానే కమీషన్లు తీసుకునే విధానం అమలైనట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

***పార్కుల్లో అభివృద్ధి పేరుతో రూ.5 లక్షలు***

హనుమకొండ ప్రాంతంలోని రెండు, మూడు పార్కుల్లో అభివృద్ధి పనుల పేరుతో అప్పట్లో జరిగిన వ్యవహారమే ఇందుకు ఉదాహరణగా బల్దియా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయా పార్కుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సరైన ప్రొసీడింగ్స్ లేకపోయినా.. వాటిని రికార్డుల్లో చూపించి బిల్లులు చేయించేలా ఓ ఇంజినీరింగ్ అధికారి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఓ కాంట్రాక్టర్ ను సంప్రదించి రూ.5 లక్షలు కమీషన్ గా ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. ముందుగానే ఆ మొత్తాన్ని చెల్లిస్తేనే తదుపరి దానికి రెండు, మూడు రెట్లు విలువైన బిల్లులు ఇప్పిస్తామనే ఒప్పందం కుదిరినట్లు బల్దియా వర్గాల్లో చర్చ జోరుగా జరుగుతోంది. మరో కాంట్రాక్టర్ నుంచి కూడా ఇదే తరహాలో డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే వ్యవహారం పూర్తిగా కార్యరూపం దాల్చకముందే అడ్డంకులు ఎదురవడంతో ఈ అవినీతి బాగోతం నిలిచి పోయినట్లు సమాచారం.

**ప్రొసీడింగ్స్ లేకుండానే బిల్లులా?**

మున్సిపల్ కార్పొరేషన్ సంస్థలో ఏదైనా అభివృద్ధి పనిని చేపట్టాలంటే పరిపాలనా అనుమతులు, సాంకేతిక అనుమతులు, పనుల ప్రొసీడింగ్స్ తప్పనిసరి అని అందరికీ తెలిసిందే. పనులు పూర్తయిన తర్వాత కొలతలు నమోదు చేసి, సంబంధిత అధికారుల ధ్రువీకరణ తోనే బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే పార్కుల వ్యవహారంలో అసలు ప్రొసీడింగ్స్ లేకుండానే పనులు చేసినట్లు రికార్డులు సృష్టించేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే.. ఒకటి రెండు అధికారుల నిర్ణయంతో మాత్రమే ఇది సాధ్యమయ్యే వ్యవహారం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫైలు ఏయే దశల్లో కదిలింది? ఎవరు పరిశీలించారు? ఎవరు ఆమోదించారు? బిల్లులు తయారయ్యాయా? చెల్లింపులు జరిగాయా? అన్నది తేలాల్సి ఉంది.

**కమీషన్ ముందు.. తర్వాతే బిల్లు ?**

కాంట్రాక్టర్ల కు లేని పనుల ఆశలు చూపించి ముందుగానే కమీషన్ నిర్ణయించి, ఆ తర్వాతే బిల్లులు ఇప్పిస్తామంటూ ఆశ చూపడం బల్దియా లో కొందరు అధికారుల అవినీతికి నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. పని విలువ కంటే బిల్లులో ఎంత పర్సంటేజ్ వస్తుంది? అందులో ఎవరి వాటా ఎంత? అన్న లెక్కలతో వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ముందస్తుగా రూ.5 లక్షలు ఇచ్చిన కాంట్రాక్టర్ ఇటీవలే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించేలా సెటిల్‌మెంట్ జరిగినట్లు బల్దియా వర్గాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. ఈ అవినీతి బాగోతానిక సంబంధించిన ఫైలు అప్పట్లో విచారణాధికారుల దృష్టికి వెళ్లకుండా దాచి పెట్టారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిజంగానే అలాంటి ఫైలు ఉంటే.. అది ప్రస్తుతం ఎక్కడుందో? దాన్ని ఎవరు నిర్వహించారు? విచారణకు ఎందుకు సమర్పించలేదు? అన్నది తేలాల్సి ఉంది. అప్పటి ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసిన అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లు ఎవరు? పార్కుల పనులకు ఎంత మొత్తంలో అంచనాలు రూపొందించారు? అసలు పనులు జరిగాయా? జరిగితే కొలతలు ఎవరు నమోదు చేశారు? బిల్లులు ఎవరు రూపొందించారు? చెల్లింపులు జరిగాయా? అన్న వివరాలను బయటకు తీస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి**

కొన్నేళ్ల క్రితం జరిగినట్లు చెబుతున్న ఈ వ్యవహారం పై సమగ్ర విచారణ చేపట్టాలని బల్దియా వర్గాల్లో డిమాండ్ వినిపిస్తోంది. సంబంధిత ఫైళ్లు, ఎంబీలు, వర్క్ ఆర్డర్లు, ప్రొసీడింగ్స్, బిల్లులు, చెల్లింపు వివరాలు, అధికారుల నోట్‌ఫైళ్లను పరిశీలిస్తే ఆరోపణల్లో వాస్తవమెంత అనేది తేలిపోతుంది. ఆరోపణలు నిజమైతే బాధ్యుల పై చర్యలు తీసుకోవడం తోపాటు ప్రభుత్వ నిధుల రికవరీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే బల్దియా లో బిల్లుల చెల్లింపుల పై అనేక ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో.. పాత ఫైళ్లను కూడా వెలికితీసి పరిశీలించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లేదంటే “పని చేయకుండానే బిల్లు.. బిల్లు చేయకముందే కమీషన్” అన్న ఆరోపణలకు మరింత బలం చేకూరింది.

# జాతరను తలపించిన మందమర్రి కోర్టు ప్రారంభోత్సవం

**హైకోర్టు జస్టిస్ నగేష్ భీమపాక**

**మందమర్రి మహా :** మందమర్రి కోర్టు ప్రారంభోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. కోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు, వేడుకలు జాతరను తలపించేలా సందడి చేశాయని హైకోర్ట్ జస్టిస్ నగేష్ భీమపాక పేర్కొన్నారు. కోర్టును ప్రారంభించిన అనంతరం హైకోర్టు జస్టిస్ మాట్లాడుతూ, కోర్టు ప్రారంభోత్సవానికి న్యాయవాదులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇంతటి ఘనంగా నిర్వహించిన ప్రారంభోత్సవ వేడుకలు తనను ఆకట్టుకున్నాయని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మందమర్రిలో కోర్టు ఏర్పాటు కావడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ముఖ్యంగా మందమర్రి కోర్టు పరిధిలోని న్యాయవాదులకు ఇది ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. కోర్టు అందుబాటులోకి రావడంతో న్యాయ సేవలు మరింత సులభతరం కానున్నాయని అశాభావం వ్యక్తంచేశారు. కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి న్యాయవాదులు, న్యాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకువచ్చారు. దీంతో మందమర్రి పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. వీరయ్య, రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్



కిషోర్ ఝా, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, చెన్నూర్, లక్షెట్టిపేట, మంచిర్యాల, ఆసిఫాబాద్ జడ్జీలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.




# ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యంగా

**ఆదిలాబాద్ మహా :** హెచ్ఐవీ ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్2026'లో భాగంగా శనివారం స్థానిక ఐపీ స్టేడియం వద్ద నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా జాతీయ, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ల యొక్క క్యూఆర్ కోడ్ అవగాహన సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించి, ఎయిడ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు రెండు నెలల పాటు జిల్లా వ్యాప్తంగా 'ఎయిడ్స్ సురక్ష మాస్ క్యాంపెయిన్' ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్క్రీనింగ్ పరీక్షలను కేవలం రిమ్స్, ఉట్నూర్, బోథ్ ప్రధాన ఆసుపత్రులకే పరిమితం చేయకుండా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణులు, క్షయ అనుమానిత లక్షణాలు ఉన్నవారికి తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు చేయాలని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరికైనా పాజిటివ్ వచ్చినట్లయితే బాధితుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతూ, ఏఆర్టీ కేంద్రాల ద్వారా ఉచిత చికిత్సను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఆదిలాబాద్ 14వ స్థానంలో ఉందని, రాబోయే రెండు నెలల కార్యాచరణ ద్వారా జిల్లాను పూర్తి 'సురక్షిత స్థానం'లోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. పాఠశాలలు, యువతలో అవగాహన పెంచడంతో పాటు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ చేపడతామని, ప్రజలు 1097 హెల్ప్‌లైన్ నంబర్, క్యూఆర్ కోడ్ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.సాధన, డివైఎస్ఓ దయానంద్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నాగరాజు, ఐసీటీసీ కౌన్సెలర్లు, పీహెచ్‌సీల వైద్యులు, వైద్య సిబ్బంది, యువత, తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నవరాత్రుల ఏర్పాట్లపై సమావేశం

- వైభవంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వెల్లడి
- నిర్వహణపై చర్చలు కీలక నిర్ణయాలు

**అదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణంలోని 49 వార్డుల్లో రానున్న వినాయక నవరాత్రులను అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు మున్సిపల్ పరిపాలన తరఫున అవసరమైన అనుమతులు తీసుకున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష తెలిపారు. శనివారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరయ్యారు. రాబోయే వినాయక నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలో అవసరమైన ఏర్పాట్లపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు.పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గ్రావెల్, మొరం, డస్టు ,వెట్ మిక్స్ కోసం రూ.10 లక్షలు, సీసీ ప్యాచ్‌వర్క్‌ల కోసం మరో రూ.10 లక్షలు కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా లైటింగ్, అంబేద్కర్ చౌక్ వద్ద స్టేజ్ ఏర్పాట్లు, పెన్‌గంగా నది వద్ద క్రేన్‌లు, లైటింగ్, చాందావాగు వద్ద క్రేన్‌లు, లైటింగ్‌తో పాటు అన్ని బారికేడ్ల ఏర్పాటుకు సుమారు రూ.34.50 లక్షలతో కూడిన ప్రతిపాదనలకు మున్సిపల్ పరిపాలన అనుమతులు పొందినట్లు తెలిపారు. 49 వార్డుల్లో గణేష్ మండపాలు, ప్రధాన చౌరస్తాల వద్ద లైటింగ్ వ్యవస్థను పటిష్టంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, బ్లీచింగ్, క్లీనింగ్ తదితర పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.వినాయక నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రత, వెలుగులు, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని చైర్‌పర్సన్ సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్,కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ , కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# దివ్యాంగులకు స్కూటీల పంపిణీ

**ఆదిలాబాద్ మహా :** దివ్యాంగుల సమగ్ర వికాసం, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, గిరిజన, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం ఉట్నూరులోని కేబీ కాంప్లెక్స్‌లో మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలో దివ్యాంగులు ఎవరిపై ఆధారపడకుండా ఆత్మగౌరవంతో జీవించేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను, పరికరాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు అవసరమైన ఆధునిక పరికరాలు, సంక్షేమ పథకాలను అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, సమాజంలో వారు ఎవరిపైనా ఆధారపడకుండా ముందుకు సాగేందుకు ఈ ఉపకరణాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని అర్హులైన ప్రతి దివ్యాంగుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు.అనంతరం దివ్యాంగులకు 30.68 లక్షల విలువగల 26 ఉపకారణాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, పలువురుప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.



# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పేద గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు
- ఉట్నూర్ పర్యటనలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ఆదిలాబాద్ మహా :** పేద, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, మారుమూల గిరిజన ప్రాంతాల విద్యార్థుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. శనివారం మంత్రి ఉట్నూరు బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఎస్పీ అఖిల్ మహాజన్ పూల మొక్కలు అందించి మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానెల్‌ను మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్యానెల్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేద, గిరిజన విద్యార్థులు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా విద్యను కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు, షూస్, పుస్తకాలు, ఇతర అవసరమైన సౌకర్యాలు అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు.ఆశ్రమ, గురుకుల పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్య, వైద్యం, మౌలిక వసతులు, సంక్షేమ రంగాలను మరింత బలోపేతం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, శారీరక దారుఢ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు, జుంబా, ఏరోబిక్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

**ఉన్నతంగా ఎదగాలి -ఎమ్మెల్సీ దండే విఠల్**

విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు చూడాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్, గిరిజన స్టడీ సర్కిల్ ద్వారా విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ అందిస్తూ అనేక మంది ఉన్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపికవుతున్నారని చెప్పారు. విద్యార్థులకు ఉన్నత చదువులు, పోటీ పరీక్షల కోసం ప్రత్యేక కోచింగ్ సదుపాయాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**సమన్వయంతో పనిచేయాలి -ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రభుత్వం కల్పిస్తున్న డిజిటల్ బోర్డులు, సైన్స్ ల్యాబ్‌లు, ఇతర ఆధునిక సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు - జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులు ఇటీవలి కాలంలో మంచి ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆశ్రమ పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN) కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులకు క్రమం తప్పకుండా శిక్షణ, నెలవారీ సమీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు.విద్యార్థుల పోషకాహార స్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ఉమ్మడి జిల్లా ఐటీడీఏ పరిధిలోని 400కు పైగా గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో సుమారు రూ.20 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీ సిబ్బంది కొరత, అత్యవసర ఆరోగ్య సమస్యలు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉట్నూరు ఐటీడీఏ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న 'వికాసం స్కూల్' ను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు, ఆరోగ్యం, పోషకాహారం అందించి వారి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు.అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఇతర అధికారులు విద్యార్థినులకు ఏకరూప దుస్తులు, కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి మంత్రి, కమిషనర్, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు సహపంక్తి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ సంతోష్, ఎస్ఈటిడబ్ల్యూ ఫణికుమారి, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఏఎస్పీ రుత్విక్ సాయి కోటే, ఆర్డీఓ మోహన్ సింగల్, డి. ప్రేమకళ, డీటీడీఓలు అంబాజీ, నిహారిక, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ అనిత జాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# బంగారు గొలుసు దొంగ అరెస్ట్

- 48 గంటల్లో దొంగను పట్టుకున్న ఆదిభట్ల పోలీసులు

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 22 మహా:** కూలి పని ఇప్పిస్తానని మహిళను నమ్మించి, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఆమె వద్దనున్న బంగారు గొలుసును ఎత్తుకెళ్లిన ఘటనలో, నిందితుడిని ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు గజ్జ విజయ్‌కుమార్ గౌడ్‌గా పోలీసులు గుర్తించారు. ఈ కేసు వివరాలను ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్‌కుమార్ రెడ్డి, సీఐ రమేష్ మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 20న వనస్థలిపురం ఎన్జీవో కాలనీ కూలీల అడ్డా వద్ద మంగమ్మ అనే మహిళను విజయ్‌కుమార్ సంప్రదించాడు. మన్నెగూడ సమీపంలో మేస్త్రీ పని ఉందని, మంచి కూలి డబ్బులు ఇస్తానని నమ్మించాడు. అనంతరం ఆమెను తన మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని ఆదిభట్ల ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు పక్కనున్న నిర్మానుష్య ప్రాంతానికి చేరుకున్న అనంతరం అక్కడ పని చేయాలని మహిళను బెదిరించి, ఆమె మెడలో ఉన్న సుమారు 12 గ్రాముల బంగారు గొలుసును బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారని, బొంగులూరులో ఒక బంగారు షాపులో నగలు విక్రయిస్తుండగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి బంగారు గొలుసుతో పాటు నేరానికి ఉపయోగించిన మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ ప్రదీప్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రజలు అపరిచిత వ్యక్తులు చెప్పే ఉద్యోగ, కూలీ పనుల మాటలను నమ్మి నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు.



# కోర్టు భవనాలనిర్మాణంతో న్యాయసేవలు అందుబాటులోకి రానున్నాయి

- బెల్లంపల్లిలో జూనియర్ సివిల్ కోర్టు నూతన భవన ప్రారంభం
- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్

**బెల్లంపల్లి ,మహా:** ప్రజలకు కోర్టు భవనాల నిర్మాణంతో న్యాయ సేవలు అందుబాటులోకి వచ్చి మెరుగైన సేవలు రానున్నాయని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్ వెల్లడించారు. బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల హైవే ప్రక్కన రూ.5 కోట్ల 60 లక్షలతో నిర్మించిన జూనియర్ సివిల్ కోర్టు భవనంనకు ప్రారంభోత్సవం నిర్వహించారు . భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి నాగేష్ నాకు బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ బెల్లంపల్లి సివిల్ కోర్టు న్యాయమూర్తి శాంతి సోనీ బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ లు పూజారులతో వేదమంత్రోచ్చారణ మధ్య ఘనంగా స్వాగతం పలికారు. గిరిజన కళాకారులు గుస్సాడీ నృత్యాన్ని ప్రదర్శించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. అనంతరం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి నగేష్ మాట్లాడుతూ న్యాయ సేవల కోసం వచ్చే కక్షిదారులు ఇబ్బందులు పడకుండా కోర్టు భవనాలు స్థానికంగా నిర్మించడంతో ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కోర్టు న్యాయమూర్తి వీరయ్య,బెల్లంపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు ,పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఆగస్టు 24న గంగారంలో ఆటోలు బంద్

- ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: జాజిరి శ్రీనివాస్
- ఈవీ ఆటోల ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలి: మల్లూరు చంద్రశేఖర్

**సత్తుపల్లి, మహా :** తెలంగాణ రాష్ట్ర ఆటో రవాణా కార్మికుల జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 24న చేపట్టనున్న ఆటోల బంద్‌లో భాగంగా సత్తుపల్లి మండలం గంగారం గ్రామం రింగ్ సెంటర్‌లో ఉన్న శ్రీ హనుమాన్ ఆటో వర్కర్స్ పాల్గొననున్నట్లు శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా జేఏసీ ముద్రించిన గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదాయానికి పరోక్షంగా ఆటో రవాణా కార్మికులు సహకరిస్తున్నారని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల తరహాలో ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ అనుసంధానంతో ఈవీ ఆటోలను తీసుకువచ్చే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని వారు కోరారు. ఈ నిర్ణయం అమలైతే ఆటో కార్మికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడ్డా అధ్యక్షుడు వినుకొండ వెంకటేశ్వరరావు, చింతా కొండలరావు, చీపూ సత్యనారాయణ, కొమ్మిగిరి రాజారావు, జువ్వా మారేశ్ తదితరులు పాల్గొన్నారు.





# రాజా బహదూర్ సేవలు నేటి, రేపటి తరాలకు మార్గదర్శకం

**ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.**

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ సమాజానికి, హైదరాబాద్ నగర అభివృద్ధికి రాజా బహదూర్ వెంకటరామారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి 179 వ జయంతి సందర్భంగా రాధిక ఎక్స్‌రోడ్ వద్ద ఆయన విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా. బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవ, విద్యాభివృద్ధి, సామాజిక సంక్షేమానికి వెంకట రామారెడ్డి అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా వారి సేవలు, ఆదర్శాలను భావితరాలకు తెలియజేయవచ్చన్నారు. రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి జీవితమంతా పేద వర్గాల కోసం దార పోశారని ఆయన కొనియాడారు. పేద విద్యార్థుల కోసం హైదరాబాద్ కాచిగూడలో ఒక హాస్టల్ను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్యను అందించాలని సంకల్పంతో ముందుకు వచ్చి ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించడం వల్ల ఉన్నత శిఖరాలకు ఎదిగారని అన్నారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వెంకటరామిరెడ్డి నేటి రేపటి భవిష్యత్ తరాలకు మార్గదర్శకమని అన్నారు. ఏ ఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి మాట్లాడుతూ రాజబహదూర్ వెంకటరామిరెడ్డి విగ్రహాన్ని ఏఎస్ రావు నగర్ రాధిక చౌరస్తాలో ఆవిష్కరించడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. వీర తెలంగాణ విప్లవ సాయుధ పోరాట యోధురాలు ఆరుట్ల కమలాదేవి. విగ్రహాన్ని కూడా ఉప్పల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు అందరు ముందుకు రావాలని పావని రెడ్డి పిలుపునిచ్చారు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారు నీలం రెడ్డి మాట్లాడుతూ రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి జయంతి ఉత్సవాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు, మధుకర్ రెడ్డి, చిట్టి నర్సిరెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు మర్రి మోహన్ రెడ్డి, పైళ్ల హరినాథ్ రెడ్డి, సంజీవరెడ్డి, కొత్త అంజిరెడ్డి, మొగిలి రాఘవరెడ్డి, మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి.తదితరులు పాల్గొన్నారు. ఆయా రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలు, మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు.

# శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం సాగించాలని ఐఎఫ్ టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.సీతారా మయ్య పిలుపునిచ్చారు. సెప్టెంబరు 1వ తేదీన కొత్తగూడెంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ శనివారం కొత్తగూడెంలో సింగరేణి హాస్పిటల్, బాబు క్యాంపు, బర్మా క్యాంపు, నర్సు క్వార్టర్స్ లో గేట్ మీటింగులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు సింగరేణి హాస్పిటల్లో ప్రమాదాలకు, అనారోగ్యాలకు గురైన వారికి వైద్యం చేయడం లేదని అవేదన వ్యక్తం చేశారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టం ఉందని దానిని అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పుఇచ్చినా హై పవర్ వేతనాలు ఇవ్వాలని కోల్ ఇండియా ఒప్పందం ఉన్నా సింగరేణిలో 35వేల మంది కాంట్రాక్టు కార్మికులకు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమ దోపిడికి వ్యతిరేకంగా చట్టాల అమలుకోసం ఉద్యమానికి సిద్ధంకావాలని ఐఎఫ్ టియు రాష్ట్రఉపాధ్యక్షులు జే.సీతారామయ్య పిలుపునిచ్చారు. త్వరలో సిఈఆర్ క్లబ్ లో జరిగే సదస్సును విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్ టియు) రీజియన్ కార్యదర్శి నెమిల్ల సంజీవ్ అధ్యక్షత వహించగా పుష్ప రాజు, రాధా, లలిత, విజయ కుమారి, సంజీవరావు, లక్ష్మి, రమణ, పుష్ప, వెంకటేశ్వర్లు, జకరయ్య, నిర్మల, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ముత్యాలమ్మ తల్లి... దీవెనలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- అమ్మవారికి... కిలో వెండి కిరీటాన్ని బహుకరించిన మేకల అయ్యప్ప
- కనుల పండుగగా వేడుకలు... అలరించిన ఆలయ ప్రాంగణం



**కుషాయిగూడ, మహా :** ముత్యాలమ్మ తల్లి దీవెనలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, తెలంగాణలో సరైన వర్షాలు లేక రైతులు కరువును ఎదుర్కొంటున్నారని వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆకాంక్షించారు. జవహర్ నగర్ చంద్రపురి కాలనీ డివిజన్ శాంతినగ్ లోని ముత్యాలమ్మ తల్లి ఆలయంలో నూతనంగా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్య హాజరై మాట్లాడుతూ దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయంగా నిలుస్తాయని, ప్రజలు ధర్మమార్గంలో పయనించాలన్నారు. బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పారిశ్రామికవేత్త మేకల అయ్యప్ప అమ్మవారికి కిలో వెండి కిరీటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు సుధాకర్ చారి, భార్గవ్ రామ్, ప్రసాద్ గౌడ్, బాలరాజ్ పటేల్ వెంకటేష్ గౌడ్, జలంధర్, నవీన్ గౌడ్, నరసింహ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.




# వయ్యారి భామ మొక్కలు పెరగడంతో పంట దిగుబడి తగ్గుతుంది

- ప్రభుత్వం సూచించే పంటలను వేయాలి.
- వ్యవసాయ అధికారుల సలహాలను పాటించాలి : ఏ ఆర్ ఐ.
- డైరెక్టర్, డా.చంద్రమోహన్

**రాజేంద్రనగర్ మహా ;** అఖిలభారత కలుపు యాజమాన్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శంషాబాద్ మండలం రాయన్నగూడ గ్రామంలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మండల వ్యవసాయ అధికారి సంయుక్తంగా నిర్వహించిన వయ్యారిభామ వల్ల కలిగే నష్టాల పై రైతులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు.

**ఈ కార్యక్రమానికి డైరెక్టర్**

ఏ ఆర్ ఐ, డా,చంద్రమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు శాస్త్రీయ సలహాలు తెలుసుకొని పంటల్లో మంచి దిగుబడి సాధించడమే కాకుండా ప్రస్తుత తరుణంలో యాంత్రీకరణ ఆవశ్యకతను రైతులు తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం లేదా వ్యవసాయ శాఖ సూచించిన మంచి దిగుబడిని ఇచ్చే ఏడు వరి రకాలు సాగు చేసే విధంగా రైతులని ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖను అయిన కోరారు.ఆ వరి రకాలు ఆర్ఎన్ఆర్, వన్ ఫైవ్ జీరో, ఫోర్ ఎయిట్ కే, ఎన్ ఎం 1638, కే ఎన్ ఎం 733, బి పి టి 5204, డబ్ల్యూ జి ఎల్, 44 హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్, అని తెలిపారు.అఖిలభారత కలుపు యాజమాన్య పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి పద్మజ మాట్లాడుతూ వయ్యారి భామ కలుపు మొక్కల వల్ల కలిగే నష్టాలు తెలిపారు.ఒక్క మొక్క 50 వేల నుంచి 60 వేల వరకు విత్తనాలు ఉత్పత్తి అయి వీటి యొక్క వ్యాప్తి విపరీతంగా పెరుగుతుంది. ఈ మొక్క ఉన్నచోట ఇతర గడ్డి లేదా పంట మొక్కల్ని పెరగనియ్యకుండా చేస్తుంది.రైతులు ధ్రువీకరించిన నోటిఫై చేసిన వరి రకాలను వేసుకున్న వారు తప్పనిసరిగా వచ్చేనెల సెప్టెంబర్ 10 లోపల ఆన్లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. అంతేకాక డీలర్ వద్ద కొన్న వరి విత్తనాలను కూడా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేయాలి. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా,అంజయ్య,డా, శ్రీధర్ సిద్ది, డా,అరుణశ్రీ ,డా, వాణిశ్రీ, వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మణ్, సర్పంచ్, రామ్ గోపాల్, రాజ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళులు

- జీవితాంతం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి
- సిపిఐ రాష్ట్ర నాయకులు కావలి నర్సింహా

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 22 మహా:** సీపీఐ ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం సీపీఐ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు కావలి నర్సింహా మాట్లాడుతూ... సురవరం సుధాకర్ రెడ్డి జీవితాంతం ప్రజా సమస్యలపై, పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ప్రజా నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ మరింతగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు పోచమోని నీలమ్మ, శివరాల లక్ష్మయ్య, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యదర్శి బండి నర్సింహా, ఏఐటీయూసీ నాయకులు ములుగు నర్సింహా, మండల సహాయ కార్యదర్శి సూర్యం, జంగిలి నర్సింహా, గుండ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఆర్టీసీ సంస్థలో ఈవీ ఆటోల ప్రతిపాదనను రద్దు చేసుకోవాలి

- ఆటో కార్మికుల నిరవధిక బందు కు సిఐటియు మద్దతు



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వం ఆర్టీసీ సంస్థలో ఈ.వి ఆటోల ప్రతిపాదనను రద్దు చేసుకోవాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.శనివారం మంచిర్యాల జిల్లా ఐబి చౌరస్తాలో సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికుల ఆటో జేఏసీ నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు రవాణా సౌకర్యం ఆర్టీసీ ద్వారా కల్పిస్తుండగా ఆటో రంగ కార్మికులు లక్షలాది మందికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నారని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులు ఉపాధి కోసం ప్రభుత్వాలపై ఆధారపడకుండా జీవనోపాధి కోసం అప్పులు చేసి ఆటోలు కొనుక్కొని ఈ రోజు ప్రభుత్వం చేపట్టిన ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఉపాధిని కోల్పోతున్నారని ఆయన ధ్వజమెత్తారు. రోజువారిగా ప్రజలకు సౌకర్యం కల్పిస్తున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికి నేటి వరకు ఇచ్చిన హామీ కూడా తీర్చకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు.ఆటో కార్మికునికి ప్రతి సంవత్సరం 12 వేలు ఇస్తానని నమ్మించి పాలకులు నట్టేట ముంచారని వివరించారు. ఈ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయటం వలన ఆటో, క్యాబ్, లారీ, డిసిఎం లాంటి మోటార్ కార్మికులకు చాలా ఉపయోగం ఉంటుందని వెల్లడించారు. ఈ సంక్షేమ బోర్డు వలన రాష్ట్ర ప్రభుత్వానికి ఏలాంటి ఆర్థికపరమైన ఇబ్బందులు లేవని చెప్పారు. వాస్తవంగా సంక్షేమ బోర్డుకు ఆటోలు కొన్నా, క్యాబ్లు కొన్నా, లారీలు కొన్నా, డిసిఎంలు కొన్నా అనేకమైన వాహనాలపై కొత్తగా కొనుగోలు చేసే సందర్భంలో 2 శాతం సెస్సు కనుక వసూలు చేసినట్లయితే కోట్లాది రూపాయలు ఈ సంక్షేమ బోర్డుకు నిధులు వస్తాయని పేర్కొన్నారు. ఈ సంక్షేమ బోర్డు వలన రవాణ రంగంలో ఉన్న కార్మికులందరికి భరోసాగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంక్షేమ బోర్డును త్వరగా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.. ఓలా, ఊబర్, రాపిడో యాప్ల ద్వారా ఆటో, క్యాబ్ డ్రైవర్లను అవసరమైన మేరకు యాప్ల వారు ఇష్టం వచ్చినట్లు కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వమే ఒక యాప్ను తీసుకురావాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కొరకు ఆగస్టు 23 అర్ధరాత్రి నుండి రాష్ట్ర వ్యాపితంగా ఆటో డ్రైవర్ల తలపెట్టిన నిరవధిక బంద్ లో కార్మికులు, ప్రజాస్వామిక వాదులు,విద్యార్థులు, యువత, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌పై కల్పిత రాతలు రాస్తే చరిత్ర క్షమించదు

**సంగిశెట్టి క్రిస్టఫర్, ఫ్రీడమ్ ఫైటర్, సామాజిక కార్యకర్త**

**వలిగొండ, ఆగస్టు 22, మహా న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అవగాహన లేకుండా, కల్పిత విషయాలతో రచనలు చేయాలని చూస్తే చరిత్ర క్షమించదని, ప్రజలు కూడా క్షమించరని ఫ్రీడమ్ ఫైటర్, సామాజిక కార్యకర్త సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు.శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, కల్పిత రాతలు రాయడం సరికాదన్నారు. అంబేద్కర్ మహనీయుడి చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తారని తెలిపారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలు, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు చేస్తే అవి కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని క్రిస్టఫర్ అన్నారు.



# దర్యాప్తులో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- కేసుల దర్యాప్తుపై ప్రత్యేక శిక్షణ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** దర్యాప్తులో చిన్నపాటి లోపాలకు కూడా తావులేకుండా చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. కొత్తగూడెం ఐఎంఈ ఫంక్షన్ హాల్లో శనివారం ఈగల్ ఫోర్స్ ఎల్.హెచ్. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎన్‌డీపీఎస్ చట్టానికి సంబంధించిన కేసుల దర్యాప్తు పై పోలీసు అధికారులకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించారు. శిక్షణలో ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితుల గుర్తింపు అరెస్టు సీజ్ ప్రక్రియ పంచనామా సాక్ష్యాల సేకరణ కేసు దర్యాప్తు చార్జ్‌షీట్ దాఖలు తదితర అంశాల్లో పాటించాల్సిన చట్టపరమైన విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎన్‌డీపీఎస్ చట్టంలోని వివిధ సెక్షన్లు వాటి అమలు విధానం కోర్టు విచారణ సమయంలో ఎదురయ్యే అంశాలు దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సాక్ష్యాధారాల పరిరక్షణ తదితర అంశాలను వివరించారు. దర్యాప్తులో చిన్నపాటి లోపాలు కూడా కోర్టు విచారణ సమయంలో న్యాయపరమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రతి దశలోనూ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.డ్రగ్స్ అక్రమ రవాణా వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని, ఎన్‌డీపీఎస్ కేసుల్లో దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచి నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలతో కేసులను దర్యాప్తు చేయాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎల్.హెచ్.రాజేశ్వరరావు సూచించారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ దర్యాప్తులో చోటుచేసుకునే లోపాలను గుర్తించి వాటిని సవరించుకోవడంతో పాటు కేసుల పురోగతిపై పోలీసు అధికారులు శిక్షణలో తెలియజేసిన సూచనలు పాటించాలని సూచించారు. ప్రతి కేసులోనూ దర్యాప్తు అధికారులు చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పక్కా ఆధారాలతో కేసులను బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతులు నిర్వహించి పోలీసు అధికారులకు సిబ్బందికి చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎల్.హెచ్.రాజేశ్వరరావు, ఫణి కుమార్‌లను జిల్లా ఎస్పీ అభినందించి సన్మానించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పి ఆర్.సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు, భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి వేడుకలు

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి ఆధ్వర్యంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి వేడుకలను శనివారం నాడు నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ బెల్లంపల్లి పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్యలు మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుండి వామపక్ష భావాలు కలిగి విద్యార్థులను ఉద్యమాల వైపు నడిపించారనీ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడిగా ,జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని,ఎన్నో విద్యార్థి ఉద్యమాలను నడిపించారని, భారత కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటు సభ్యునిగా రెండు దఫాలు నల్గొండ పార్లమెంటు నియోజవర్గం నుండి రెండుసార్లు ఎన్నికై పార్లమెంట్లో ఎన్నో ప్రజా సమస్యలపై పోరాడడం జరిగిందని పేర్కొన్నారు .భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శిగా 2012 నుండి 2019 వరకు పనిచేశారనీ, ఆయన నాయకత్వంలో పార్టీని అన్ని రంగాలలో విస్తృత పరిచిన మహోన్నత నేతకు నివాళులు అర్పిస్తూ వారు చూపిన మార్గంలో పయనిస్తూ వారి ఆశయాన్ని కమ్యూనిస్టులుగా ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉన్నదని అలా చేసినప్పుడే ఆయనకు నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి కే యం యు జాతీయ సమితి సభ్యులు అక్క పెల్లి బాబు, జిల్లా సమితి సభ్యులు మేకల రాజేశం, నాయకులు రాధాకృష్ణ, అందుగుల రాజేందర్, బూర్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.




# చిరంజీవికి భారతరత్న అవార్డు ఇవ్వాలి

- వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్
- ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు
- రక్తదాన శిబిరం ఏర్పాటు
- రైల్వే స్టేషన్ ఆవరణలో పేదలకు అన్నదానం



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సామాజిక సేవలను అందిస్తున్న మెగాస్టార్ చిరంజీవికి భారతరత్న అవార్డును ప్రదానం చేయాలని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మైటీ మెగాస్టార్ స్టేట్ ఫ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ నేతృత్వంలో శనివారం రైల్వే స్టేషన్ ఆవరణలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ చిరంజీవి మధ్యతరగతి కుటుంబంలో జన్మించికృషి దీక్షా దక్షితలు కఠోర పరిశ్రమ వృత్తి పట్ల అంకితభావం అనునిత్యం అహర్నిశలు కష్టపడే మనస్తత్వం అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇటు సినీ రంగంలో రాణిస్తూ అటు సామాజిక సేవలందిస్తున్న చిరంజీవిని గుర్తించి ఆయనకు ప్రభుత్వం వెంటనే భారతరత్న అవార్డును ప్రధానం చేయాలని కోరారు. అదేవిధంగా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబులు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి సేవలను కొనియాడారు. సభ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమం రూపశిల్పి మెగాస్టార్ చిరంజీవికి వీరాభిమాని సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ ఈ ప్రపంచంలో ఏ హీరోకు లేని సేవ తత్పరులైన అభిమానులు చిరంజీవికి మాత్రమే ఉన్నారని మెగాస్టార్ చిరంజీవిలో కష్టించే మనస్తత్వం అందరినీ ప్రేమించే మనస్తత్వం నిరంతర సేవా తత్పరత ఉందన్నారు. తాను చిరంజీవి అభిమానిని కావడం పూర్వజన్మ సుకృతమని అన్నారు.మెగాస్టార్ చిరంజీవి పొందని అవార్డులు రివార్డులు లేవని తప్పకుండా భారత ప్రభుత్వం భారతరత్న అవార్డును అందించాలని విజ్ఞప్తి చేశారు.తొలుత మెగాస్టార్ చిరంజీవి బర్త్ డే కేక్ ను కట్ చేసి అతిథులందరూ ఆనందంతో ఒకరికొకరు తినిపించుకొని పంచిపెట్టారు. అనంతరం మెడికేర్ డయాగ్నస్టిక్స్ సెంటర్ అధినేత డాక్టర్ ప్రవీణ్ సారథ్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పేదవారికి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు.తొలుత ప్రముఖ కళాకారులైన స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, అపర బాలు అల్లి శంకర్, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మధుర గాయని మణి మునీల ఆలపించిన చిరంజీవి చిత్రాల్లోని పాటలు అందరిని ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అల్లూరి నాగరాజు, కార్పొరేటర్లు కనుకుంట శ్రీను కేకే, బ్యాండ్ దుర్గా, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, అసోసియేషన్ నాయకులు స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, అపరబాలు అల్లిశంకర్, సింగరేణి సేవా సమితి నాయకురాలు మునీల, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతోటి పాల్, గుగులోత్ కృష్ణ, విగ్నేష్, సురేందర్, సల్మాన్ ఖాన్ తోతా, డాక్టర్ తమ్మళ్ళ జోసెఫ్ రవి, శనగ లక్ష్మణ్, ఉల్లోజు వెంకట రమణ,ప్రిన్సిపల్ దేవీలాల్, చింతల యాడ్స్ ప్రవీణ్, అంతోటి రాజు, బడికల రమేష్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మద్దెల ఆదర్శ్, కేదాసి కిరణ్, ఆఫ్రైమ్ చింటూ, అఖిల్, పెనగడప శ్రీను, రాజేశ్వర రావు, సాయి కుమార్ పాల్గొనగా రక్తదాన శిబిరాన్ని సరళ బ్లడ్ బ్యాంక్ నుండి రామకృష్ణ వినయ్ కిరణ్ తదితరులు నిర్వహించారు.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- రూపారెడ్డి హత్య కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపాలి
- ఐసా ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ
- అల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఐసా) రంగారెడ్డి జిల్లా కన్వీనర్ చరణ్ గౌడ్.




**మొయినాబాద్ మహా :** అల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఐసా) రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో "డ్రగ్స్‌కు నో చెప్పండి" అనే నినాదంతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడం, మాదకద్రవ్యాల వినియోగం వల్ల సమాజానికి కలుగుతున్న తీవ్ర నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ముఖ్యంగా విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా కాపాడేందుకు ప్రభుత్వాలు మరింత కఠినమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా అల్ ఇండియా స్టూడెంట్స్అసోసియేషన్(ఐసా) రంగారెడ్డి జిల్లా కన్వీనర్ చరణ్ గౌడ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం నేడు యువత భవిష్యత్తుకు పెను ప్రమాదంగా మారుతోందని అన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలవుతున్న విద్యార్థులు చదువులకు దూరమై, చివరకు నేరాల వైపు వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువతను మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి కాపాడేందుకు ప్రభుత్వం, పోలీసులు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.మాదకద్రవ్యాల విక్రయాలు, సరఫరా చేస్తున్న వ్యక్తులు, ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని చరణ్ గౌడ్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వాటి వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపారెడ్డి హత్య ఘటనపై కూడా ఐసా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయురాలు దారుణ హత్యకు గురికావడం అత్యంత బాధాకరమైన విషయమని చరణ్ గౌడ్ అన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత జీవితాలు నాశనం కాకుండా ప్రభుత్వ యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, మాదకద్రవ్యాల సరఫరా వెనుక ఉన్న వ్యక్తులు, ముఠాలను గుర్తించి కఠినంగా శిక్షించాలని చరణ్ గౌడ్ కోరారు. విద్యార్థులు, యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజల్లో మరింత విస్తృతమైన అవగాహన కల్పించడంతో పాటు, యువత భవిష్యత్తును కాపాడేందుకు ఐసా నిరంతరం ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తుందని చరణ్ గౌడ్ స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు "మాదకద్రవ్యాలకు నో చెప్పండి - యువతను కాపాడండి" అనే నినాదంతో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐసా జిల్లా సహ కన్వీనర్లు రేశ్వంత్, మణికాంత్, ఐసా జిల్లా నాయకులు వికాస్, వినోద్ ,అలీ, కార్తీక్, సాయి చరణ్, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.




# ఎంవిఆర్ఎస్ కార్మికుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి

**వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు**

**వరంగల్, బ్యూరో మహా :** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎంవిఆర్ఎస్ 2002 అజాంజాహి మిల్లు 318 మంది మాజీ కార్మికుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం పై జిల్లా కలెక్టరేట్ లో శనివారం సంబంధిత అధికారులు, పిటిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల అభ్యర్థన, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అజాంజాహి మిల్లు మిగిలిన స్థలం ఎంత ఉందో సర్వే చేయాలని కుడా అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అనంతరసమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయా లపై తమ అభిప్రాయాలను తెలిపేందుకు కార్మికులు సమయం కోరినట్లు కలెక్టర్ తెలిపారు. వారి అభిప్రాయాల మేరకు మరోసారి సమావేశం నిర్వహించి తదుపరి చర్యలు చేపడతామని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, అజాంజాహి మిల్లు మాజీ కార్మికులు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో ఘనంగా శ్రీకృష్ణ సేవా విద్యా చైతన్య యాత్ర



**పాలకుర్తి ఆగస్టు 22 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి మండల కేంద్రానికి శనివారం శ్రీకృష్ణ సేవా విద్యా చైతన్య యాత్ర చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా 21 రోజుల పాటు కొనసాగే ఈ యాత్ర ఆగస్టు 14న ప్రారంభం కాగా,సెప్టెంబర్ 3 వరకు వివిధ గ్రామాలు,కాలనీలు, పట్టణాల్లో సాగనుంది.పాలకుర్తికి చేరుకున్న యాత్ర బృందానికి స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. శ్రీకృష్ణుడి సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,విద్యపై అవగాహన పెంపొందించడం,యువతలో సేవాభావం మరియు సామాజిక బాధ్యతలను గుర్తుచేయడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో యాదవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మారం తిరుపతి యాదవ్,గౌరెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నరసయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా యాత్ర బృందం సభ్యులు మాట్లాడుతూ. ప్రతి గ్రామం, కాలనీలో ప్రజలను కలుసుకుంటూ విద్య, సేవ, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పిస్తున్నామని ,సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పాలకుర్తి యాత్రకు స్థానికుల నుంచి లభించిన స్పందన పట్ల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి యాదవ సంఘం అధ్యక్షుడు ధారవేణి సతీష్ యాదవ్, మేకల ప్రశాంత్,ధారవేణి కుమారస్వామి యాదవ్, ధారవేణి మల్లయ్య,సంజీవ్,పుట్ట రాజేందర్, ఓదెలు ,ధారవేణి శ్రీనివాస్,సాగర్,శ్రావణ్ కుమార్ యాదవ్,శ్రీశైలం,భూమక్క,కొమ్ము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# విశ్వేశ్వరయ కళాశాలలో ఘనంగా కాన్వొకేషన్ వేడుక

- **పట్టాలు అందుకోవడం వారి జీవితంలో నూతన అధ్యాయానికి నాంది**
- **జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. సుషామ**
- **2026 గ్రాడ్యుయేటింగ్ పట్టాలు అందుకున్న విద్యార్థులు**

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 22 మహా:** నియోజకవర్గంలోని ఎం.పి. పటేల్‌గూడ-బొంగ్లూర్ సమీపంలోని విశ్వేశ్వరయ ఇంజినీరింగ్ కళాశాలలో 2026 కాన్వొకేషన్ వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల మేనేజ్‌మెంట్ , ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీటెక్, ఎంటెక్, ఎంబీఏ కోర్సులకు చెందిన యూజీ, పీజీ గ్రాడ్యుయేటింగ్ విద్యార్థులకు పట్టాలు అందజేశారు.ఈ కార్యక్రమానికి యూజీసీ-ఎంటీటీఎంసీ డైరెక్టర్, జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. సుషామ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యా ప్రస్థానంలో కాన్వొకేషన్ వేడుక ఒక కీలక ఘట్టమని, పట్టాలు అందుకోవడం వారి జీవితంలో నూతన అధ్యాయానికి నాంది పలుకుతుందని అన్నారు. విద్యార్థులు తమ విద్యను సమాజ అభివృద్ధికి ఉపయోగిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రమేష్, చైర్మన్ డాక్టర్ కె. సుధాకర్, సెక్రటరీ కె. లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ కె. మల్లికార్జున స్వామి, ట్రెజరర్ బి. శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు శ్రీరామ్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, బాలేశ్వర్, కన్హయ్య శెట్టి, లక్ష్మీకాంత్ రెడ్డి, రాములు, కోఆర్డినేటర్ రఘుపతి, కో కన్వీనర్స్ రవి వర్ధన్, శ్రీకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవంతో కాలనీల్లో పచ్చదనం

- **మౌలిక వసతుల అభివృద్ధికి సమగ్ర చర్యలు: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**



**హనుమకొండ, మహా:** నగరంలో పచ్చదనం, పరిశుభ్రత పెంపుతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు.హంటర్ రోడ్‌లోని 49వ డివిజన్ లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీల్లో నిర్వహించిన వనమహోత్సవంలో బల్దియా కమిషనర్ టి.వెంకన్నతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే మొక్కలు నాటారు. నాటిన మొక్కలను ప్రతి ఒక్కరూ సంరక్షించాలని పిలుపునిచ్చారు.నగరంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆధునిక అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. దీనికి అనుగుణంగా నీటి పైప్‌లైన్లు, రోడ్లు, సెంట్రల్ లైటింగ్ పనులను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ.530 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్‌లో పాత నీటి నిల్వ వ్యవస్థలను ఆధునీకరించడంతో పాటు అవసరమైన చోట కొత్త నిర్మాణాలు చేపడుతున్నామన్నారు.కాలనీల్లో సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.కమిషనర్ టి.వెంకన్న మాట్లాడుతూ వనమహోత్సవంలో కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి
# బిజెపి, బీఆర్ఎస్ కుట్ర

- **సీఎంను పలచన చేసే మాటలు సహించం**
- **కొండా కుటుంబం క్షమాపణ చెప్పాల్సిందే- వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాసు నాయక్**



**కారేపల్లి, మహ:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను చేతిలో ఉంచుకొని ప్రతిపక్ష ప్రభుత్వాలపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాసు నాయక్ విమర్శించారు. కారేపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం వైరా ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి కి అహర్నిశలు పనిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి చరిష్మా, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ట ను దెబ్బతీయటానికి బిజెపి టీఆర్ఎస్ కలిసి చేసిన కుట్రలో భాగంగానే అమెరికా పర్యటనకు అనుమతులు నిరాకరణ అని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలలో పాతకపోతుందని భయపడిన బిజెపి టిఆర్ఎస్ లు సీఎం అమెరికా పర్యటనకు అడ్డంకులు సృష్టించిందని అన్నారు . సీఎం పర్యటన పై బిజెపి నేత అరవింద్ కుమార్ వ్యాఖ్యలు పరిణితి లేని తనానికి నిదర్శనమన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన అభివృద్ధి ఆగదని ప్రజల ఆశీర్వాదం తో రాష్ట్రాన్ని మరింత పురోగతి అభివృద్ధి సాధిస్తుందన్నారు.

కొండా సురేఖ దంపతులకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం ఇచ్చిందని దాన్ని మరచి సీఎం రేవంత్ రెడ్డి పై కుమార్తె సుస్మిత చేత అనుచిత వ్యాఖ్యలు చేయడం సహించరానిదని అన్నారు. ప్రభుత్వం మంత్రివర్గంలో ఉండి సీఎం ను పలచన చేసే విధంగా కుమార్తెతో మాట్లాడించడం దాన్ని ఖండించకపోవడం అవివేకమన్నారు. కెసిఆర్ నియంతృత్వ కుటుంబ పాలన వ్యతిరేకంగా పిసిసి అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి అందరిని ఐక్యం చేశారని, అందరూ కష్టపడితేనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. సమస్యలను పార్టీ అంతర్గతంగా పరిష్కరించుకోవల్సి ఉండగా పార్టీని ముఖ్యమంత్రిని పలుచన చేసే విధంగా వ్యవహరించడం ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు సహించరన్నారు. ఇప్పటికైనా కొండా సుష్మి తన కట్టడం చేయాలని, కాంగ్రెస్ అధిష్టానం కొండా దంపతులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న సంక్షేమానికి లోటు లేకుండా ప్రభుత్వం చేస్తుందని కొనియాడారు. వైరా నియోజకవర్గానికి పామాయిల్ ఫ్యాక్టరీని తీసుకొచ్చానని, సీతారామ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం ఇప్పించానన్నారు. బుగ్గ వాగును వినియోగించుకొని సింగరేణి మండలాన్ని సస్యశ్యామలం చేస్తానని తెలిపారు మండల కేంద్రం కారేపల్లి ని పట్టణం రీతిగా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో పోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార తయారీ కేంద్రాన్ని కారేపల్లి లో ఏర్పాటుచేసి అక్కడనుండి పాఠశాలకు సెలవు చేయడం జరుగుతుందని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నానని, సర్పంచులు తనపై అలగకుండా అభివృద్ధి చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు జిల్లా కార్యదర్శి బానోతు రామ్మూర్తి నాయక్ నాయకులు అడ్డగోడు ఐలయ్య పొలగాని శ్రీనివాస్, సురపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, పెద్ద బోయిన ఉమాశంకర్, గుగులోతు బీముడు, ధారావత్ వినోద్, బోళ్ల రమేష్, సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్య రంజిత్, సర్పంచులు మేదరి వీర ప్రతాప్, బానోతు రాందాస్, భూక్య బాలు, మండల నాయకులు ఎండి అనీఫ్ బోడ సెట్ రామ్ తాజుద్దీన్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

# కుమార్తె వ్యాఖ్యలతో మంత్రి కొండా సురేఖ కు రాజకీయ చిక్కులు

- **మంత్రి సురేఖ స్థానంలో మున్నూరు కాపు వర్గానికి మంత్రి పదవి దక్కేనా?**
- **కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం పై వీడని ఉత్కంఠ**

**వరంగల్, బ్యూరో మహా ;** తెలంగాణ కాంగ్రెస్ లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పై మంత్రి సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ అంతర్గతంగా అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వివరణ కోరగా.. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిగతమని కొండా సురేఖ వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ అధిష్ఠానం తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నదాని పై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ను తప్పిస్తే.. ఆమె స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చ కూడా పార్టీలో సాగుతోంది. కొండా సురేఖ స్థానంలో కొత్తగా ఎవరిని మంత్రివర్గంలోకి తీసుకుంటారన్న చర్చలో మొదట వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేరు వినిపిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు మంత్రివర్గంలో అవకాశం కల్పించవచ్చన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. పార్టీ అధిష్ఠానం, ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలు ఉన్న నేతగా ఆయనకు మంచి పేరు ఉందని తెలుస్తోంది. మంత్రివర్గంలో మార్పులు చోటుచేసుకుంటే ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందన్న చర్చ నేపథ్యంలో ఆది శ్రీనివాస్ పేరు తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. కాగా ఈ ప్రచారం పై కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన ఇప్పటివరకు వెలువడలేదు.

**మంత్రివర్గంలో మార్పులు అనివార్యమా?**
ఒక వేళ మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ను తప్పించాలని అధిష్ఠానం నిర్ణయిస్తే.. ఆమె స్థానాన్ని భర్తీ చేసే వ్యక్తి ఎంపికలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు కీలకంగా మారే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే ఆది శ్రీనివాస్ పేరు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ఇప్పటివరకు ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఖరారైనట్లు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడ లేదు. కొండా సురేఖ పై అధిష్ఠానం తీసుకునే నిర్ణయం, దాని తర్వాత మంత్రివర్గంలో మార్పులపై సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ పెద్దల వైఖరిపైనే తదుపరి పరిణామాలు ఆధారపడి ఉంటాయి. దీంతో కొండా సురేఖ వ్యవహారం ఎటు తిరుగుతుంది? ఒకవేళ మార్పు జరిగితే ఆది శ్రీనివాస్‌కు అవకాశం దక్కుతుందా? మున్నూరు కాపు సామాజిక వర్గానికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభిస్తుందా? అన్న చర్చ ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ లో ఆసక్తికరమైన అంశంగా మారింది.

**మున్నూరు కాపు సామాజిక వర్గానికి అవకాశం?***
మంత్రివర్గంలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ కూడా కొంతకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో అదే సామాజిక వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ కు మంత్రి పదవి ఇస్తే సామాజిక సమీకరణాల పరంగా పార్టీకి ప్రయోజనం ఉంటుందన్న వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన వేములవాడ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతుండటంతో పాటు ప్రభుత్వ విప్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉత్తర తెలంగాణలో పార్టీ బలోపేతం, సామాజిక సమీకరణాలు, మంత్రివర్గంలో ప్రాంతీయ ప్రాతినిధ్యం వంటి అంశాలను అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుంటే ఆయనకు అవకాశం ఉండొచ్చన్న ప్రచారం పార్టీలో ఊపందుకుంది. కొండా సురేఖ పై పార్టీ క్రమశిక్షణ కమిటీ వివరణ కోరడం, ఆమె కుమార్తె వ్యాఖ్యల పై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరగడంతో తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది. అయితే ప్రస్తుతం ఆమెను మంత్రి పదవి నుంచి తప్పిస్తారనే విషయానికి అధికారిక ధ్రువీకరణ లేదు. అలాగే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కూడా ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనకు సంబంధం లేదని సురేఖ ఇప్పటికే వివరణ ఇచ్చిన నేపథ్యంలో అధిష్ఠానం దీనిని ఎలా పరిగణిస్తుంది? ముఖ్యంగా పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో? అనే అంశం కీలకంగా మారింది.



# దొతిగుడేము విలేజ్ హేజ్ కంపెనీముందు బిజేపీ ధర్నా

**భువనగిరి , న్యూస్ :** భారతీయ జనతా పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం విలేజ్ హేజ్ కంపెనీలో సి బ్లాక్ లో పేలిన రియాక్టర్ కారణంగా కంపెనీ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ యొక్క ధర్మా లో ముఖ్యఅతిథిగా భువనగిరి బిజెపి జిల్లా అధ్యక్షులు ఉట్కూరు అశోక్ గౌడ్ ఇన్చార్జ్ ఏలే చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ కంపెనీలో జరిగినటువంటి పేలుడు రియాక్టర్ ల వల్ల కంపెనీ లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది ఈ యొక్క ప్రాణాలను ప్రతి పేలుడులో ఎన్నో కొన్ని డబ్బులు ఇచ్చి కంపెనీ చేతులు దులుపుకుంటుంది కానీ పేదప్రాణాలకు లెక్కచేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నటువంటి ఇలాంటి కంపెనీ వెంటనే మూసివేయాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ ధర్నాలో మండల అధ్యక్షులు మేకల రవీందర్ రెడ్డి,జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లె కాడి బసవయ్య, జిల్లా ఎస్సీ మోర్చా చెరుకు వెంకటేష్,మాజీ మండల అధ్యక్షులు మేకల చొక్కా రెడ్డి, దోతి గూడెం గ్రామ ఉపసర్పంచ్ బద్దం వెంకటరెడ్డి, మండల జనరల్ సెక్రటరీ ముద్దం హరీష్, మండల నాయకులు గుమ్మి దామోదర్ రెడ్డి, ఈ యాట శ్రీనాథ్, వస్పరి రాకేష్, వస్పరి నరేందర్, తరుణ్, వంశీ, నవీన్, విజయ్, ముఖేష్, కిరణ్ తదితరులు పాల్గొనడం జరిగింది



# నల్లబ్యాడ్జీలతో రూపారెడ్డికి నివాళి

**కుషాయిగూడ, మహా:** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి ప్రిన్సిపాల్ కె. రూపారెడ్డి హత్యను నిరసిస్తూ తెలంగాణ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నివాళులర్పించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. టీపీటీఎల్ఎఫ్ అధ్యక్షుడు కర్నె సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కాప్రా ఎంఈవో మహ్మద్ అజాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రూపారెడ్డి మృతికి సంతాపం తెలిపిన వారు.. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయికి బానిసలైన ఇద్దరు పదో తరగతి విద్యార్థులు రూపారెడ్డిని హత్య చేసిన ఘటన ఉపాధ్యాయులు, అధ్యాపకుల్లో తీవ్ర భయాందోళన కలిగించిందని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థులు, యువత జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి మాఫియాపై ప్రభుత్వం, పోలీసులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రూపారెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, ఉపాధ్యాయులు, లెక్చరర్లకు తగిన భద్రత కల్పించాలని కోరారు.

# శ్రీ అయోధ్య వాసవీ సత్రం ప్రాజెక్ట్ దిగ్విజయోస్తు

- **ఆశీర్వదించిన విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ**

**కుషాయిగూడ, మహా :** శ్రీ అయోధ్య వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం ట్రస్ట్ ప్రతిష్ఠాత్మకంగా అయోధ్యలో తలపెట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మిక సత్రం ( అయోధ్య వాసవీ సత్రం ) దిగ్విజయంగా పూర్తి చేస్తారని విశాఖ శ్రీ శారద పీఠాధిపతి షణ్మత స్థాపన ఆచార్య జగద్గురు శంకరాచార్య సంప్రదాయ శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి ఆశీర్వదించారు. తమ ట్రస్ట్ తలపెట్టిన ప్రాజెక్టును ఆశీర్వదించాలని ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ హరినాథ్ గుప్త బెలిదె ఆధ్వర్యంలో చీఫ్ అడ్వైజర్, వైశ్యరత్న డాక్టర్ మల్లికార్జున్ పసుమర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేముల కాశీ విశ్వనాథ్ బాబు తదితరుల బృందం స్వామివారిని కలిసింది. స్వామివారు ప్రాజెక్టు వివరాలు అడిగినప్పుడు చైర్మన్ హరినాథ్ గుప్త మాట్లాడుతూ, ప్రాజెక్టును విశదీకరించారు. మహాస్వామి వారు ఆశీర్వదిస్తూ, ప్రాజెక్టు అద్భుతంగా ఉందనీ, అనుకున్న సమయానికి ప్రాజెక్టును దిగ్విజయంగా పూర్తి చేస్తారని ఆశీర్వదించారు. సంకల్పం ప్రజా శ్రేయస్సుతో ముడిపడి ఉంటే దైవానుగ్రహం పుష్కలంగా లభిస్తుందని ప్రవచించారు. అయోధ్య ప్రాజెక్టును దిగ్విజయంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి దేవదేవత రాజశ్యామల అమ్మవారు అలాగే ఈశ్వర అనుగ్రహం లభిస్తాయని మహా స్వామివారు చైర్మన్ హరినాథ్ గుప్తను ప్రత్యేకంగా దీవించారు.

# మినీ డంపింగ్ యార్డ్ లా మారిన చెన్నాపురం చెరువు

- **కాలుష్య కాసారంగా చెన్నాపురం చెరువు.**
- **చెరువు కట్ట వెంబడి నిర్మాణ శిథిలాలు.**
- **ప్లాస్టిక్ వ్యర్థాలతో గుట్టలుగా చెరువు పరిసర ప్రాంతాలు.**

**కుషాయిగూడ, మహా :** జవహర్ నగర్ పరిధిలోని చెన్నాపురం చెరువు కట్ట మినీ డంపింగ్ యార్డులా మారి అనకొండను తలపిస్తుంది. జిల్లాలోని అతిపెద్ద పూర్వపు మున్సిపల్ కార్పొరేషన్ గా గనుతి కెక్కిన జవహర్ నగర్ లోని వివిధ చెరువులు కాలుష్య కాసారంగా మారి ప్లాస్టిక్ వ్యర్థాలతో గుట్టలుగా పరిసర ప్రాంతాలు మినీ డంపింగ్ లా మారిన తీరు వ్యవస్థలో లోపానికి అర్థం పడుతున్నాయి. జవహర్ నగర్ పరిధిలోని చెన్నాపురం చెరువు కట్ట వెంబడి ఖాళీ స్థలాల్లో నిర్మాణ శిథిలాలు చెత్తాచెదారంతో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా పడి తీవ్రమైన కాలుష్య కాసారంగా మారి చెత్తాచెదారంతో అనకొండ లాంటి గుట్టలను తలపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. జవహర్ నగర్ లో వంద కాలనీలకు పైగా విస్తరించి ఉన్న జవహర్ నగర్ గ్రామపంచాయతీ నుండి మేజర్ గ్రామపంచాయతీ వరకు తరువాత మున్సిపాలిటీ గా ఆ తర్వాత మున్సిపల్ కార్పొరేషన్ గా విస్తరించినప్పటికీ పారిశుద్ధ్య నిర్వహణలో మున్సిపల్ అధికారుల అలసత్వంతో చెరువు దాని పరిసరాలు దుర్గంధం వెలువడుతూ వైతరణి నదిని తలపిస్తున్నాయి. పేరుకే పెద్ద కార్పొరేషన్ గా అవతరించినప్పటికీ మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపల్ యంత్రాంగం విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవలే గ్రేటర్ మున్సిపల్ లో విలీనమైనా అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉందని ప్రజల ఆరోపణ. జవహర్ నగర్ రాజకీయంగా ప్రస్తుతం స్తబ్దంగా ఉండి రాజకీయ వైచిత్రి అగమ్య గోచరంగా తయారైంది. కీసర సర్కిల్లో అతి పెద్ద డివిజన్ గా జవహర్ నగర్ చంద్రపురి కాలనీ వెలసినా అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉందని స్థానికుల ఉవాచ. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే లీచెట్ నీరు చేరడంతో చెరువు నీరు ఇప్పటికే నల్లగా మారి విషతుల్యమైంది. దానికి తోడు ఇప్పుడు చుట్టుపక్కల వెలువబడుతున్న వ్యర్థాల గుట్టల కారణంగా దుర్వాసన దోమల బెడద తీవ్రమవడంతో స్థానికులు నరకయాతన పడుతున్నారు. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా చెరువు నుంచి వెలువడే లేచెట్ పదార్థాల లోని విషతుల్యమైన అర్సనిక్ కాడ్మియం, సీసం, కోబాల్ట్, నికెల్, తదితర రసాయన పదార్థాలు చెరువులో కలవడం వల్ల జీవవైవిధ్యం తీవ్రంగా దెబ్బ తినడంతో పాటు చెరువులో జలచర రాశులు మత్స్య సంపద కాలుష్య కాసారానికి బలై జీవవైవిధ్యం పూర్తిగా దెబ్బతిన్నదని జవహర్ నగర్ ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ఒకప్పుడు త్రాగే నీరుకు ఈ చెరువే ఆధారం.**



పూర్వపు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న చెన్నాపురం చెరువు ఒకప్పుడు తాగునీటికి ఆవాసంగా మారిందని, నేడు ఆ చెరువు కాలుష్యపు కోరలో చిక్కుకొని, కాలుష్య కాసారంగా మారి నీరు విషతుల్యమై జీవావరణ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని పంటలకు కూడా పనికి రాకుండా పోయింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ చెరువును పునరుద్ధరించి తిరిగి తాగునీరుకు అనువైన చెరువుగా మార్చాలి.

**మేకల కావ్య (జవహర్ నగర్ మాజీ మేయర్, బిఆర్ఎస్ నేత).**

**చెరువు శుద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం**



చెరువు పునరుద్ధరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని త్వరలోనే చెరువు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుంది.

**నాయకం భాస్కర్ పటేల్,( కాంగ్రెస్ యువ నాయకులు గాంధీనగర్ కాలనీ).**

**మినీ ట్యాంక్ బండ్ లా తీర్చిదిద్దుతాం**



ప్రధాన రహదారికి దగ్గరలో ఉన్న చెన్నాపురం చెరువును త్వరలోనే మినీ ట్యాంక్ బండ్ లా తీర్చి దిద్దుతాం. చెరువు కాలుష్య కోరల నుండి విముక్తం కావడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రజలు పరిసరాల పట్ల అవగాహన కలిగి ఉండి చెత్తాచెదారం డంపింగ్ బిన్ ల లోనే వేస్తూ స్వచ్ఛతకు పాటుపడండి.

**తోటకూర వజ్రేష్ యాదవ్ (జిల్లా కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులు)**

# క్లాసిక్ లుక్‌లో మమిత బైజు

**క్లాసిక్ చీరకట్టులో మమిత బైజు మెరుపులు**

మలయాళ, తమిళ చిత్రసీమలో తనదైన గుర్తింపు తెచ్చుకుంటున్న యువ నటి మమిత బైజు సంప్రదాయ చీరకట్టులో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. పచ్చని ఎమరాల్డ్ రంగు చీరపై అందమైన బంగారు అంచులు, ఆకర్షణీయమైన పర్పుల్ రంగు పఫ్ స్లీవ్స్ బ్లౌజ్‌తో ఆమె సరికొత్త లుక్‌లో మెరిశారు. సంప్రదాయ ఆభరణాలు, మల్లెపూలతో అలంకరించిన జడ, నుదుటన ఎర్రటి బొట్టుతో ఆమె అందం మరింత ఇనుమడించింది.సింపుల్‌గా కనిపించే బంగారు హారం, చెవిదిద్దులు, ఆకుపచ్చ గాజులు ఆమె చీరకట్టుకు చక్కగా సరిపోయాయి. ముఖ్యంగా ఆమె ముఖంపై కనిపించిన చిరునవ్వు ఫొటోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆధునికతతో పాటు సంప్రదాయ అందాన్ని మేళవించిన ఈ లుక్ సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది.2001 జూన్ 22న కేరళలోని కొట్టాయం జిల్లా కిడంగూరులో జన్మించిన మమిత బైజు చిన్ననాటి నుంచే సినిమాల్లోకి అడుగుపెట్టారు. 2016లో వచ్చిన 'పావాడ' చిత్రంలో బాలనటిగా కనిపించిన ఆమె.. 2017లో 'సర్వోపరి పాలక్కారన్'తో అధికారికంగా నటిగా పరిచయమయ్యారు. అనంతరం 'ఖో ఖో', 'సూపర్ శరణ్య' వంటి చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు పొందారు. అయితే 2024లో విడుదలైన 'ప్రేమలు' చిత్రం మమిత కెరీర్‌ను ఒక్కసారిగా మలుపుతిప్పింది. ఇందులో రీను పాత్రలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ చిత్రం భారీ విజయాన్ని అందుకోవడంతో పాటు అత్యధిక వసూళ్లు సాధించిన మలయాళ చిత్రాల జాబితాలో చోటు సంపాదించింది. దీంతో మమిత దక్షిణాది యువ కథానాయికల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.ఇదే సమయంలో తమిళ చిత్రసీమలోనూ మమిత తన ప్రయాణాన్ని ప్రారంభించారు. 2024లో 'రెబల్' సినిమాతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె.. 2025లో ప్రదీప్ రంగనాథన్‌కు జోడీగా నటించిన 'డ్యూడ్'తో మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. విభిన్న కథలు, వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ దక్షిణాది సినీ పరిశ్రమలో తన కెరీర్‌ను వేగంగా విస్తరిస్తున్నారు.ప్రస్తుతం ధనుష్‌తో 'కారా', విజయ్‌తో 'జననాయకన్', సూర్యతో 'విశ్వనాథ్ & సన్స్', నివిన్ పౌలీతో 'బెత్లహేమ్ కుటుంబ యూనిట్', అలాగే 'ప్రేమలు 2' వంటి పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో మమిత నటిస్తున్నారు. వరుస విజయాలు, స్టార్ హీరోలతో అవకాశాలు రావడంతో దక్షిణాది సినీ పరిశ్రమలో ఆమె క్రేజ్ రోజురోజుకూ పెరుగుతోంది. సంప్రదాయ లుక్‌లోనూ, ఆధునిక పాత్రల్లోనూ తన ప్రత్యేకతను చూపిస్తూ మమిత బైజు యువ కథానాయికగా దూసుకెళ్తున్నారు.





# యశ్ టాక్సిక్‌పై భారీ అంచనాలు

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి కీలక పాత్రలు పోషించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా ఇంగ్లిష్, కన్నడ భాషల్లో రూపొందింది. హిందీ, తెలుగు, తమిళం, మలయాళంలో డబ్బింగ్ వెర్షన్లు విడుదల కానున్నాయి.ఆగస్టు 26, 2026న ప్రపంచవ్యాప్తంగా 'టాక్సిక్' ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు ముందు హైదరాబాద్‌లో చిత్రబృందం గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత కేవీఎన్ మాట్లాడుతూ.. భారీ విజన్, బోల్డ్ ఆలోచనతో సినిమాను రూపొందించామని తెలిపారు. ట్రైలర్‌లో కనిపించే ప్రతి ఫ్రేమ్‌లో చిత్రబృందం తీసుకున్న శ్రద్ధ స్పష్టంగా కనిపిస్తుందని చెప్పారు.'టాక్సిక్' ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని నిర్మాత పేర్కొన్నారు. సినిమా చూసే ప్రతి ఒక్కరికీ భిన్నమైన ఫీలింగ్ కలుగుతుందని అన్నారు. యశ్ భారతీయ సినిమాను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారని ప్రశంసించారు. దర్శకురాలు గీతు మోహన్‌దాస్ ప్రతి సన్నివేశంలో భావోద్వేగాలను అద్భుతంగా ఆవిష్కరించారని, సినిమా కోసం ఎంతో శ్రమించారని చెప్పారు. నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి తదితరులు తమ పాత్రల్లో మెప్పించారని నిర్మాత తెలిపారు. సంగీత దర్శకులు విశాల్ మిశ్రా, రవి బస్రూర్ అద్భుతమైన సంగీతాన్ని అందించారని పేర్కొన్నారు. సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దిల్ రాజుతో కలిసి పనిచేయడం సినిమాకు అదనపు బలాన్ని ఇచ్చిందని కేవీఎన్ అన్నారు. 'టాక్సిక్'ను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు సరైన భాగస్వామ్యం లభించిందని చెప్పారు. సినిమా విడుదల కోసం అవసరమైన సహకారాన్ని అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సహకరించిన పోలీస్ శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. 'టాక్సిక్' కేవలం ప్రేక్షకులను ఎంగేజ్ చేయడం, ఎగ్జైట్ చేయడమే కాకుండా వారి పల్స్‌రేట్‌ను మార్చే అనుభూతిని ఇస్తుందని నిర్మాత వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంగా మెగాస్టార్ చిరంజీవికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# 'రాకా'పై పెరుగుతున్న అంచనాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా'. సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సైంటిఫిక్ యాక్షన్ థ్రిల్లర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. సినిమాకు సంబంధించిన ప్రతి కొత్త అప్‌డేట్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది.తాజాగా నటి మంచు లక్ష్మి 'రాకా' షూటింగ్ సెట్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న భారీ స్థాయి పనులను చూసి ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు తాను చూడని వింత జీవులు, భారీ మొక్కలు, అద్భుతమైన సెట్స్ తనను ఆకట్టుకున్నాయని ఆమె పేర్కొన్నారు. వందలాది మంది వివిధ విభాగాల్లో కలిసి ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్న విధానం ప్రత్యేకంగా అనిపించిందని తెలిపారు.'రాకా'లో చూపించబోయే ప్రపంచం ప్రేక్షకుల ఊహలకు కూడా అందని విధంగా ఉంటుందని మంచు లక్ష్మి అభిప్రాయపడ్డారు. ఇలాంటి భారీ విజువల్ ట్రీట్‌ను వెండితెరపై చూసేందుకు తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. ఆమె వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. అల్లు అర్జున్‌ను అట్లీ తొలిసారి డైరెక్ట్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సైంటిఫిక్ అంశాలతో పాటు భారీ యాక్షన్, గ్రాండ్ సెట్స్, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి. తాజాగా మంచు లక్ష్మి సెట్ విజిట్ తర్వాత చేసిన వ్యాఖ్యలు 'రాకా' ఏ స్థాయిలో తెరకెక్కుతోందనే ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. అట్లీ-బన్నీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ విజువల్ వండర్ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.




# ఇరుముడిలో మోక్షద కీలక పాత్ర

మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపొందిన 'ఇరుముడి' ప్రస్తుతం ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటూ విజయవంతంగా దూసుకెళ్తోంది. సినిమాకు పాజిటివ్ టాక్ రావడంతో చిత్రానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ముఖ్యంగా రవితేజ కుమార్తె మోక్షద భూపతిరాజు ఈ ప్రాజెక్ట్‌లో పోషించిన బాధ్యతలపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ఇరుముడి'కి మోక్షద ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేసినట్లు తెలుస్తోంది. అయితే ఆమె పాత్ర కేవలం ఆ బాధ్యతలకే పరిమితం కాలేదని ప్రచారం జరుగుతోంది. సినిమా ప్రాజెక్ట్ ప్రారంభ దశ నుంచి నిర్మాణానికి సంబంధించిన పలు వ్యవహారాలను ఆమె దగ్గరుండి పర్యవేక్షించినట్లు సమాచారం. అంతేకాకుండా కథను రవితేజ ఓకే చేయడంలోనూ మోక్షద కీలకంగా వ్యవహరించినట్లు టాక్ వినిపిస్తోంది.తండ్రి రవితేజ నుంచి సినిమా నిర్మాణానికి సంబంధించిన అనుభవాలను నేర్చుకుంటున్న మోక్షద..సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్‌లో రవితేజ నటించే కొన్ని ప్రాజెక్టుల నిర్మాణ వ్యవహారాల్లోనూ ఆమె కీలకంగా భాగస్వామి కానున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడేదు.'ఇరుముడి' విడుదలైన తర్వాత మోక్షద పేరు సోషల్ మీడియాలో మరింతగా వినిపిస్తోంది. సినిమా నిర్మాణంలో ఆమె చేసిన కృషికి తగిన గుర్తింపు ఇవ్వాలని పలువురు నెటిజన్లు పోస్టులు చేస్తున్నారు. దీంతో రవితేజ కుమార్తె సినీ రంగంలో తన ప్రయాణాన్ని ఏ విధంగా కొనసాగిస్తారనే ఆసక్తి పెరుగుతోంది.ఇదిలా ఉంటే.. రవితేజ కుమారుడు మహాధన్ కూడా సినీ రంగంలోకి అడుగులు వేస్తున్నారు. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. దీంతో రవితేజ కుటుంబం నిర్మాణం, దర్శకత్వ విభాగాల్లోనూ సినీ పరిశ్రమలో తమ ప్రయాణాన్ని కొనసాగిస్తుండటం ఆసక్తికరంగా మారింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com